సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక
సంపుటి: 17 | సంచిక: 141
పేజీలు: 08 | వెల: రూ.2:00
హైదరాబాద్ | మంగళవారం 19 మే 2026
Published from Hyderabad, Vijayawada.

## మరింత పటిష్టంగా భారత్-నార్వే బంధం

- ఇంధనం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారం
- ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఏర్పాటు
- నార్వే పర్యటనలో ప్రధాని మోడీ కీలక ప్రకటన



న్యూఢిల్లీ,మే18(సాక్ష్యం): భారత్-నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారాన్ని

మిగతా 3 లో..



## ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

**తమిళనాడు అనుసరిస్తున్న విధానం అనుసరణీయం**
**రాష్ట్రాలకు కేంద్ర కేబినెట్ కార్యదర్శి సోమనాథన్ సూచన**

హైదరాబాద్,మే18(సాక్ష్యం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింపుల్ ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు

మిగతా 2 లో..



## కెబిఆర్ పార్క్ చుట్టూ చెట్ల నరికివేతపై స్టే

**సుప్రీం ఆదేశాలతో నిలిచిపోనున్న ఫ్లై ఓవర్ నిర్మాణాలు**

న్యూఢిల్లీ,మే18(సాక్ష్యం): కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీం కోర్టు స్టే విధించింది. ఎకో సెన్సిటివ్ జోన్ లోపల చెట్లను

మిగతా 2 లో..



## దేశంలో చమురు కొరత లేదు

**మరోమారు పుకార్లను ఖండించిన కేంద్రం**

న్యూఢిల్లీ,మే18(సాక్ష్యం): భారత్‌లో కేవలం తొమ్మిదిన్నర రోజులకు సరిపడా చమురు నిల్వలు మాత్రమే ఉన్నాయంటూ వస్తున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. దేశంలో చమురు కొరత అంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలపై కేంద్రం స్పష్టతనిచ్చింది.

మిగతా 2 లో..

# నక్సలిజాన్ని సమూలంగా అణచివేశాం

## నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

## కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడి



రాయ్‌పూర్,మే18(సాక్ష్యం): దేశాన్ని పట్టి పీడిస్తున్న వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలికి, నక్సలిజం రహిత సమాజాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గడ్ లోని జగదల్పూర్ లో సోమవారం నాడు తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో మావోయిస్టుల నిర్మూలనకు కృషి చేసిన పోలీస్ అధికారులను ఆయన సన్మానించారు .తెలంగాణ రాష్ట్రంలో నక్సలిజాన్ని సమూలంగా అణచివేసి, రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులను సన్మానించారు. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంను

మిగతా 2 లో..





# సతీశన్ అనే నేను..

- కేరళం సీఎంగా సతీశన్ ప్రమాణం
- 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు
- 14 మంది తొలిసారిగా బాధ్యతలు
- కేరళంలోనూ మహిళలకు ఉచిత బస్సు
- సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక విభాగం
- ఆశావర్కర్ల గౌరవ వేతనం 3వేలకు పెంపు
- కేరళం సిఎం సతీశన్ కీలక నిర్ణయాలు



## హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే, రేవంత్ రెడ్డి

తిరువనంతపురం,మే18(సాక్ష్యం): కేరళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువనంతపురం లోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా.. 20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 20 మందిలో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టినవారే కావడం గమనార్హం. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రులను ఎంపిక చేసింది. దీంతో దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికారంలోకి వచ్చింది. కేరళ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ

మిగతా 5 లో..

## నగరంలో అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలు

### రాష్ట్రంలో ఆరు గిరిజన మ్యూజియంల ఏర్పాటు

హైదరాబాద్,మే18(సాక్ష్యం): హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ కమ్ డైరెక్టర్ సంతోష్ బి.ఎమ్., హాజరయ్యారు. ఈ సందర్భంగా నెహ్రూ

మిగతా 5 లో..



# మాక్ ఎక్సర్‌సైజ్

- ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్' కీలకం
- తక్షణం స్పందిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం
- మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి



హైదరాబాద్,మే18(సాక్ష్యం): ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నె÷-లకెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం

మిగతా 5 లో..

## బండి భగీరథ్‌పై అదనపు సెక్షన్లు

**మరింత పకడ్బందీగా కేసు విచారణ**
**నేరం రుజువైతే పదేళ్లు జైలు శిక్ష !**



హైదరాబాద్,మే18(సాక్ష్యం): పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌పై పోలీసులు మరో సెక్షన్ అదనంగా చేర్చారు. బీఎన్ఎస్ 64(2)(ఓ) సెక్షన్‌ను నమోదు చేశారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం చేశాడనే ఆరోపణలపై ఈ సెక్షన్ దర్యాప్తు అధికారులు జత చేశారు. దీనిప్రకారం నేరం రుజువైతే పదేళ్లకు మించి జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఒక్కోసారి జీవిత ఖైదు కూడా విధించవచ్చు. నెల 8న బాధితురాలైన మైనర్‌పై లైంగిక వేధింపులు జరిగాయంటూ ఆమె తల్లి పేట్‌బషీరాబాద్

మిగతా 2 లో..



# రక్తసిక్తం

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

**ట్రక్కును ఢీకొన్న కంటెయినర్.. ప్రమాదంలో పదిమంది మృతి**

ముంబై,మే18(సాక్ష్యం): మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లిఁ బృందందతో వెళుతున్న ట్రక్కును కంటెయినర్ ఢీకొనడంతో పదిమంది దుర్మరణం చెందారు. ముంబై - అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో 10 మందికిపైగా మృతిచెందగా,

మిగతా 5 లో..

## ఈపీసెట్ 2026లో ఎంజేపి విద్యార్థుల హవా

**అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ఐదువేల లోపు ర్యాంకులు**
**ఇంజనీరింగ్‌లో 10వేల లోపు ర్యాంకులు**

హైదరాబాద్,మే18(సాక్ష్యం): మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ విద్యార్థులు ఈఏపీసెట్-2026 ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. అగ్రికల్చర్ , ఫార్మసీ మరియు ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నత విద్యా కోర్సుల కోసం నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలో 3781 మంది

మిగతా 5 లో..

## మ్యూజియాలు జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు

- భావితరాలకు భద్రపరచిన అమూల్య వారసత్వ సంపద
- అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంలో మంత్రి జూపల్లి



హైదరాబాద్,మే18(సాక్ష్యం): మ్యూజియాలు అనేవి కేవలం పురాతన వస్తువుల నిల్వ కేంద్రాలు మాత్రమే కావని, అవి మన నాగరికత, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి

మిగతా 5 లో..

# సంపాదకీయం

## పాలకులే సంక్షోభాల సృష్టికర్తలు!

ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఓ సంక్షోభం వస్తూనే ఉంటుంది. ఇరాన్ సంక్షోభం ఇంకా ముగియలేదు. ట్రంప్ మరోమారు రంకెలు వేస్తున్నారు. బాంబులు వేస్తామని బెదిరిస్తున్నారు. ఇదే జరిగితే మరింత ఆర్థిక సంక్షోభం తప్పేలా లేదు. ఈ సంక్షోభాలకు భయపడి సంసారం చేద్దామ లేక ఇల్లు చక్కబెట్టుకుందామా అన్నది పాలకులు ఆలోచన చేయాలి. ముఖ్యంగా ప్రధాని మోడీ ఆర్థిక చర్యలు దిద్దుబాటు లాగా లేవు. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన వేళ కేవలం కాన్వాయ్‌లో కార్లు తగ్గించడంతో సరిపెట్టేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్త చిన్నాభిన్నం అవుతోంది. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గుతోంది. సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. వేలకోట్లు వడ్డీలు కట్టడానికే వెచ్చిస్తున్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలు ముందు న్నాయి. అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేస్తున్నారు. ఇంట్లోకి వెళ్లి వండిపెట్టడమే తరువాయి అన్నట్లుగా పథకాలను వండి వారుస్తున్నారు. దీంతో ప్రభుత్వాన్ని నడపడానికి నిత్యం అప్పులు చేయడం, ఉన్న భూములను అమ్మేయడం అలవాటు చేసుకున్నారు. ఓట్ల కోసం నానాగడ్డి కరుస్తారనడానికి ఈ పథకాలే నిదర్శనం. ఇకపోతే పొదుపు విషయంలో ప్రజాప్రతినిధులకు లెక్కేలేదు. గతంలో మంత్రులు, ముఖ్యమంత్రులు సాధారణ ప్రజల్లాగా విమానాల్లో వెళ్లేవారు. ఇప్పుడు ఏకంగా ప్రత్యేక విమానాలను వాడుతున్నారు. హెలికాప్టర్లకు కొదవే లేదు. మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా చీటికీ మాటికీ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వాడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అత్యవసరంగా వెళ్లడానికి వేరు. కానీ ప్రతి కార్యక్రమం కోసం విమానాలు, హెలికాప్టర్లు విచ్చలవిడిగా వాడేస్తున్నారు. చంద్రబాబు అయితే స్వచ్ఛాంధ్ర, పెన్షన్ల పంపిణీకి చేస్తున్న ఆర్భాటం అంతాఇంతాకాదు. వీటికి వెళ్లకుండా కార్యక్రమాలను నడిపించేవచ్చు. కానీ ఆయన నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లో ఉండడం కోసం నానా తంటాలు పడుతుంటారు. ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలకు ప్రత్యేక విమానాల అవసరం ఏమిటన్నది బాబు చెప్పాలి. అంతెందుకూ, ఇదివరకు మంత్రులు రైళ్లలో ప్రయాణించేవారు. ఇప్పుడు ఎంతమంది రైలెక్కుతున్నారన్నది తెలియదు. అయితే విమానం లేదా భారీ కాన్వాయ్‌లు వేసుకొని ఊరేగుతున్నారు. మంత్రులు, అధికారులు వారాంతం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కోసం అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ప్రభుత్వాలలో దుబారాకు అంతే ఉండదు. ఒకప్పుడు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లలో ఇన్ని వాహనాలు ఉండేవి కావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సైతం మూడు వాహనాలే వినియోగించేవారు. వారి భద్రతను నలుగురైదుగురు సిబ్బంది మాత్రమే చూసేవారు. ఇప్పుడు పదుల సంఖ్యలో వాహనాలను కాన్వాయ్‌లో చేర్చారు. ముఖ్యమంత్రుల బహిరంగ సభలు, సమావేశాలకు వందలమంది పోలీసులను నియమిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు మంత్రులు, ముఖ్యమంత్రులకు అదనపు భద్రత అవసరమయ్యేది. ఇప్పుడు నక్సలైట్లు దాదాపుగా అంతరించిపోయారని కేంద్రమే ప్రకటించింది. అయినా భద్రతను కుదించడం లేదు. ఈ విషయంలో చంద్రబాబు ఆదర్శమని చెప్పాల్సిందే. హంగూ ఆర్భాటంలో ఆయన ముందుంటారు. ఆయిల్ సంక్షోభంతో ప్రధాని మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు తాము వినియోగించే వాహనాల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ అడుగు ముందుకేసి మరింత జాగ్రత్తలు చేపట్టారు. మహానాడును సైతం వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయించారు. ఏకంగా మంత్రివర్గ సమావేశంలోనే పొదుపు చర్యలపై చర్చలు జరిపారు. అయితే తమ కార్యక్రమాల్లో పొదుపు పాటించి, దుబారా ఖర్చులు తగ్గించుకోగలిగితే మంచిదే. కానీ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలలో దుబారా సర్వసాధారణం అయింది. ముఖ్యమంత్రులు పాల్గొనే కార్యక్రమాలకు హంగూ ఆర్భాటం పెరిగింది. దుబారా అని ఆలోచించకుండా మన సొమ్ము కాదు కదా అని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తుంటారు. ఖర్చుల నియంత్రణ, పొదుపు అనేది ప్రజలకు ఆదర్శంగా ఉండాలన్నది కనిపించడం లేదు. మితిమీరిన ఖర్చులతో రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెట్టేసారు. జగన్ ఉండగా అంతకు మించి అన్నట్లుగా డబ్బులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారు. విశాఖలో అత్యాధునిక గెస్ట్ హౌజ్‌లు కట్టుకున్నారు. ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా మందీ మార్బలంతో పాటు, భారీ కాన్వాయ్‌లతో వెళుతుంటారు. ఇలా అప్పులు కావడానికి పాలకులు తీరు కారణం. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినా సంక్షేమ పథకాలతో వారిని నిర్వీర్యులను చేస్తున్నారు. రూపాయికే కిలో బియ్యం, ఉచిత సిలిండర్, ఉచిత కరెంట్, ఉచితంగా చీరలువంటి సంక్షేమ పథకాల అవసరమా అని ఆలోచించడం లేదు. ఉత్పాదక సాధించి, ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించాల్సింది పోయి అనుత్పాదక వ్యయం వైపు దేశంతో పాటు ప్రజలను మళ్లించడం ఏ తరహా అభివృద్ధి అన్నది పాలకులు చెప్పాలి. ప్రభుత్వాలు లక్షల కోట్ల అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయడం ఎందుకో ప్రజలకు జవాబు ఇవ్వాలి. బడా పారిశ్రామికవేత్తలు అప్పులు ఎగవేస్తున్నా ఎందుకు చోద్యం చూస్తున్నారో చెప్పాలి. ఇవన్నీ సవరించుకో నంతవరకు దేశంలో అప్పులమీద ఆధారపడాల్సిందే. పాలకుల తీరు మారాలి. ప్రజలతీరూ మారాలి. కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం కాదు అని గుర్తించాలి. అప్పలుఉ చేయడం, దేశాన్ని అధోగతి పాలు చేయకుండా పాలన చేయడం అలవాటు చేసుకుంటే మంచిది.

## చంద్రనాథ్ రథ్ హత్య కేసులో కీలక పరిణామం

కోల్‌కతా,మే18(సాక్ష్యం): పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు చంద్రనాథ్ రథ్ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. చంద్రనాథ్‌ను కాల్చిచంపిన షూటర్ రాజ్‌కుమార్‌ను ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో సీబీఐ సోమవారంనాడు అరెస్టు చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ పోలీసుల సాయంతో ఈ అరెస్టు జరిగింది. ఇప్పటికే ట్రాన్సిట్ రిమాండ్ తీసుకున్న సీబీఐ మంగళవారం నాడు కోల్‌కతాలోని సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు అతన్ని హాజరుపరచనుంది. సువేందు అధికారికి అత్యంత విశ్వసనీయుడుగా చంద్రనాథ్ రథ్‌కు పేరుంది. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన రెండ్రోజుల తర్వాత మే 6వ తేదీ రాత్రి చంద్రనాథ్ కోల్‌కతా వెళ్తుండగా నార్త్ 24 పరగణాల జిల్లాలోని దోల్తాలో హత్యకు గురయ్యారు. మోటార్ బైక్‌పై వచ్చిన దుండగులు అత్యంత సమీపం నుంచి ఆయనపై కాల్పులు జరిపారు. ఈ హత్య కేసును తొలుత సిట్ చేపట్టింది. చంద్రనాథ్ కుటుంబానికి న్యాయం చేస్తానని వాగ్దానం చేసిన సీఎం ఆ తర్వాత కేసును సీబీఐకి అప్పగించారు. ఇప్పటికే ఈ కేసులో మయాంక్ రాజ్ మిశ్రా, విక్కీ మౌర్య, రాజ్ సింగ్ అనే ముగ్గురిని అరెస్టు చేశారు. మిశ్రా, మౌర్యలను బిహార్‌లోని బక్సర్‌లోనూ, సింగ్‌ను యూపీలోని బల్లియాలో అదుపులోనికి తీసుకున్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని అధికారం నుంచి దింపి తాము ఘనవిజయం సాధించడంతో టీఎంసీనే ఈ హత్యకు పాల్పడిందని బీజేపీ తొలుత ఆరోపించింది. టీఎంసీ ఎంపీ అభిషేక్ ప్రమేయం ఉందంటూ అనుమానం వ్యక్తం చేసింది.

## ఈ-గవర్నేన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

మొదటిపేజీ తరువాయి..

అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ టివి సోమనాథన్ ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలను ఆదేశించారు. సోమవారం కేంద్ర కేబినెట్ సెక్రెటరీ తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఆయా రాష్ట్రాల్లో ఉన్న నిబంధనల మేరకు ప్రజలకు సరళతరమైన,మెరుగైన ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రయత్నించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని వివరించారు. ప్రజలకు పాదర్శకంగా సులభతరమైన పౌర సేవలను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు వివిధ విభాగాల వారీగా ఆన్ లైన్ లో డ్యాష్ బోర్డుల ద్వారా తెలియజేస్తున్నామన్నారు. మున్సిపల్, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, రెవెన్యూ తదితర శాఖల్లో ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. కేబినెట్ సెక్రెటరీ సిఎస్ కె.రామకృష్ణారావును ఈ-గవర్నెన్స్ విధానంపై అభినందించారు. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న



విధానాన్ని కూడా అధ్యయనం చేసి ప్రజలకు ఎలాంటి ఆర్థికభారం, ఇతర ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలో ఈ-గవర్నెన్స్ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ నవీన్ మిట్టల్, ముఖ్యకార్యదర్శి యోగితారాణా, షికాగోయల్, సెక్రెటరీలు రఘునందన్ రావు, ఇ.శ్రీధర్, అనితా రామచంద్రన్, హౌసింగ్ ఎం.డి వి.పి. గౌతం, సెర్పు సిఇఒ దివ్య, తదితరులు పాల్గొన్నారు.

# నక్సలిజాన్ని సమూలంగా అణచివేశాం

మొదటిపేజీ తరువాయి..

ప్రస్తావించారు. ఈ సందర్భంగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు,మాజీ డిజిపి బి.శివధర్ రెడ్డి, డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్ / గ్రేహౌండ్స్) అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి కమిషనర్ / మాజీ ఎస్ఐబీ ఐజీపీ సుమతితో పాటు ఆమె నేతృత్వంలోని ఎస్ఐబీ బృందాన్ని అమిత్ షా సత్కరించి, వారి విశేష సేవలను అభినందించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. జనవరి 2024లో ఒక తీవ్రవాదానికి వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘ పోరాటంలో ఇదొక చారిత్రాత్మక మైలురాయి అని ఆయన కొనియాడారు. 1970వ దశకం నుంచి 31 మార్చి 2026 వరకు దాదాపు మూడు తరాల పాటు దేశ ప్రజలు నక్సలిజం అనే ఒక పీడకలను చవిచూశారని అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర రక్తపాతం, అభివృద్ధి నిలిచిపోవడం, యువత భవిష్యత్తు అంధకారమవ్వడం వంటి పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. నక్సలిజం నిర్మూలన పోరాటంలో దేశంలోని దాదాపు అన్ని



అంతర్గత సమావేశంలో 31 మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని తాము కాలపరిమితిని నిర్దేశిరచుకున్నట్లు వెల్లడించారు.మేం ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు చాలామంది ప్రైవేట్ చర్చల్లో ఇది సాధ్యం కాదంటూ సందేహాలు వ్యక్తం చేశారు. కానీ మేం స్పష్టమైన ప్రణాళికతో, పక్కా వ్యూహంతో ముందుకు సాగాం. మా దంతేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ఈ రోజు బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ఇప్పుడు నక్సలిజం మహమ్మారి నుంచి విముక్తి పొందిందని, వామపక్ష రాష్ట్రాలకు చెందిన జవాన్లు ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాల వల్లే నేడు ఈ విజయం సాధ్యమైందని హోం మంత్రి అన్నారు. క్సలిజం కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన సమస్య కాదని, తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌తో పాటు దేశవ్యాప్తంగా దీనిపై ఆందోళన ఉండేదన్నారు.క జీవిత కాలంలో సాధించలేమనుకున్న అసాధ్యమైన లక్ష్యాన్ని, భద్రతా దళాల సమన్వయం మరియు పట్టుదలతో సాకారం చేశామని అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, భద్రతా దళాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బండి భగీరథ్‌పై అదనపు సెక్షన్లు

మొదటిపేజీ తరువాయి..

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లినప్పుడు.. పోలీసులు హైడ్రామా మధ్య సెక్షన్ 74, 75 అఫ్ బీఎన్ఎస్, సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్ 2012 మేరకు కేసులు నమోదు చేశారు. ఆ తరువాత బాధితురాలి నుంచి మహిళా అధికారులు వాంగ్మూలం తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు బాధితురాలు నిజం చెప్పకుండా ఉండేలా ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో అన్ని వైపుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగడంతో.. ప్రభుత్వం సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది. వెంటనే దర్యాప్తును చేపట్టిన రితిరాజ్ సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఘటన గురించి ఆరా తీశారు. అప్పటికే పోలీసులు బాధితురాలి నుంచి తీసుకున్న వాంగూల్మాన్ని పరిశీలించారు.

అందులో స్పష్టత లేకపోవడంతో మరింత లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం నేరుగా బాధితురాలిని కలిసి జరిగిన విషయం తెలుసుకున్నారు. పోక్సో కేసు దర్యాప్తులో మహిళా అధికారులు ఫ్రెండ్లీ వాతావరణంలో బాధితురాలి నుంచి జరిగిన ఘటనకు సంబంధించిన అంశాలను సేకరించాల్సి ఉ ఒటుంది. ఈ క్రమంలోనే రితిరాజ్ నేరుగా బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెతో చాలాసేపు మాట్లాడినట్టు తెలిసింది. బాధితురాలు చెప్పిన విషయాలకు పోలీసులు కేసు నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేని విషయాన్ని ఆమె గుర్తించారు. బాధితురాలు చేసిన ఆరోపణలు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1), 6ల పరిధిలోకి వస్తాయి. బాధితురాలిపై పలుమార్లు లైంగికదాడి జరిగినట్టు ఆరోపణలుంటే ఈ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని చట్టం సూచిస్తున్నది. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా జరిగిన నేరం అత్యంత తీవ్రమైనదని గ్రహించిన డీసీపీ ఆ మేరకు కేసులో సెక్షన్లను అలర్ట్ చేయించారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జోడించారు. సెక్షన్ల ప్రకారం నేరం రుజువైతే.. నిందితుడికి 20 ఏండ్లకు తగ్గకుండా జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించే అవకాశాలున్నాయి.

## దేశంలో చమురు కొరత లేదు

మొదటిపేజీ తరువాయి..

ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కొందరు ఇలాంటి అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని, వీటిని ప్రజలెవరూ నమ్మవద్దని పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ (ఖఎః ఈజీఇబి అఠ।ఞీ) విభాగం స్పష్టం చేసింది. అమెరికా మినహాయింపు గడువు ముగిసినప్పటికీ రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కొనసాగుతాయని స్పష్టం చేసింది. 'రష్యా చమురుపై అమెరికా ఆంక్షల సమయంలో కూడా భారత్ అక్కడి నుంచి కొనుగోలు చేసింది. ఆంక్షలు సడలించినపుడూ కొనుగోళ్లు చేశాం. ఇకపై కూడా ఆ కొనుగోళ్లు కొనసాగుతాయి. చమురును ఏ దేశం నుంచి కొనాలనే నిర్ణయం పూర్తిగా మన వాణిజ్య ప్రయోజనాలపైనే ఆధారపడి ఉంటుంది. రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు ఉన్నా, లేకపోయినా మన కొనుగోళ్లు కొనసాగుతాయి' అని పెట్రోలియం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ స్పష్టం చేశారు. సరఫరా లోటు లేకుండా దేశ అవసరాలను తీర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సుజాత శర్మ తెలిపార. ప్రస్తుతం దేశంలో ముడి చమురు కొరత లేదని స్పష్టం చేశారు. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ రష్యా చమురుపై ఆమెరికా తాత్కాలికంగా ఆంక్షలు ఎత్తివేసిన సంగతి తెలిసిందే. ఆ గడువు మే 17వ తేదీతో ముగిసింది. ఈ నేపథ్యంలో రష్యా నుంచి చమురు సరఫరా ఆగిపోతుందనే ఆందోళనల నేపథ్యంలో కేంద్రం స్పష్టతనిచ్చింది.

## కెబిర్ పార్క్ చుట్టూ చెట్ల నరికివేతపై స్టే

మొదటిపేజీ తరువాయి..

ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టగా.. చెట్ల నరికివేతపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. సోమవారం జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ముందు ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. పర్యావరణ ప్రేమికుల తరఫున సీనియర్ కౌన్సిల్ కె. వివేక్ రెడ్డి బలమైన వాదనలు వినిపించారు. చెట్ల నరికివేత వల్ల వస్తున్న పర్యావరణ నష్టాన్ని వివరించి, ప్రభుత్వ నిర్మాణ పనులపై స్టే విధించాలని కోర్టును కోరారు. దీంతో చెట్ల నరికివేతపై స్టే ఇచ్చిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు స్టే ఆదేశాలతో ఎస్ఆర్‌డీపీ పనులు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. ప్రధానంగా కేబీఆర్ జంక్షన్ పరిసరాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణానికి భారీ ఆటంకం ఏర్పడింది.




Can Fin Homes Ltd

**కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్**

బ్రాంచ్ ఆఫీస్: ప్లాట్ నెం. 28, 1వ అంతస్తు, బ్రమరాంబిక కాలనీ, రామచంద్రాపురం, హైదరాబాద్-502032,
టెలీ: 08455280777, +91-7625079184, వెబ్‌సైట్: www.canfinhomes.com,
ఇ-మెయిల్: Ramachandrapuram@canfinhomes.com

**అనుబంధము-4-ఎ (రూల్ 9(1)లోని నిబంధలను చూడుము) స్థిరాస్తుల అమ్మకము కొరకు అమ్మకపు ప్రకటన**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9(1) సదుపాయముల క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకంపు ప్రకటన.

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు)కు మరియు హామీదారు(లు)కు తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా/కుదవ పెట్టిన దిగువ తెలిపిన స్థిరాస్తులను **కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్, రామచంద్రాపురం బ్రాంచ్** వారి అధీకృత అధికారి ద్వారా స్వాధీనము చేసుకొని సంబంధిత రుణగ్రహీతలు మరియు హామీదారుల నుండి **కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్** వారికి రావలసిన దిగువ తెలియజేయబడిన బకాయి మొత్తము మరియు దానిపై తదుపరి వడ్డీ మరియు ఇతర చార్జీలతో వసూలు చేసుకొనుటకు **"ఎక్కడ ఎలా ఉందో అక్కడ అలానే", "ఎక్కడ ఏది ఉంటే అదే"** మరియు **"అక్కడ ఏమున్నదో అదే"** ప్రాతిపదికన **తేది: 10/06/2026న ఉ. 11.30 గం॥ల నుండి మ. 12.30 గం॥ల వరకు** విక్రయించబడును.

| క్ర. సం. | రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతల పేరు | డిమాండ్ నోటీసు తేది | చెల్లించవలసిన బకాయి మొత్తం | రిజర్వు ధర | బయానా | స్వాధీనతా రకం | ఆస్తి వివరణ |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 1. రుణగ్రహీత: శ్రీ జి సరిత 2. సహ-రుణగ్రహీత: శ్రీమతి జి లక్ష్మి రేఖా దేవి | 06-11-2024 | రూ. 33,87,646/- (రూపాయలు ముప్పై మూడు లక్షల ఎనభై ఏడు వేల ఆరు వందల నలభై ఆరు మాత్రమే) | రూ. 32,00,000/- (రూపాయలు ముప్పై రెండు లక్షలు మాత్రమే | రూ. 3,20,000/- (రూపాయలు మూడు లక్షల ఇరవై వేలు మాత్రమే) | భౌతికముగా | **తనఖాపెట్టిన ఆస్తి యొక్క షెడ్యూల్:** తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా, దుండిగల్ గండిమైసమ్మ మం॥, మల్లంపేట గ్రా॥ మరియు గ్రామపంచాయతీ వద్ద సర్వే నెంలు. 200 203 204 205 212 213 215/ఎ 229 230 248 249 250 251 252 మరియు 254 లలోని ప్లాట్ నెంలు. 247, 248 249-భాగము 258 భాగము 259 & 260 లపై నిర్మించబడిన 38.5 చ॥గ॥ల విస్తీర్ణము గల (1222.20 చ॥గ॥లలోనిది) భూమి అవిభాజ్యవాటాతోపాటు 1375 చ॥అ॥ల బిల్టప్ ఏరియా (కామన్ ఏరియా మరియు కార్ పార్కింగ్ కలుపుకొని) మరియు విష్ణు మాన్య రెసిడెన్సీలోని రెండవ అంతస్తులో గల సగం పూర్తైన నివాస ఫ్లాట్ నెం. 204 యావదాస్తి. **భూమి కొరకు సరిహద్దులు:** ఉత్తరం: పొరుగువారి భూమి, దక్షిణం: అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్, తూర్పు: 40 వెడల్పు రోడ్డు, పడమర: 40 వెడల్పు రోడ్డు. **ఫ్లాట్ కొరకు సరిహద్దులు:** ఉత్తరం: ఫ్లాట్ నెం. 205, దక్షిణం: అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్, తూర్పు: 40 వెడల్పు రోడ్డు, పడమర: ఖాళీ ప్రదేశం & ఫ్లాట్ నెం. 203. **తాకట్టురుణభారాలు లేవు** |
| 2 | 1. రుణగ్రహీత: శ్రీ కాసగోని దీక్షిత్ 2. సహ-రుణగ్రహీత: శ్రీమతి కాసగోని లక్ష్మి ప్రసన్న | 02-05-2025 | రూ. 46,49,031/- (రూపాయలు నలభై ఆరు లక్షల నలభై తొమ్మిది వేల ముప్పై ఒక్కటి మాత్రమే) | రూ. 29,50,000/- (రూపాయలు ఇరవై తొమ్మిది లక్షల యాభై వేలు మాత్రమే | రూ. 2,95,000/- (రూపాయలు రెండు లక్షల తొంభై ఐదు వేలు మాత్రమే) | భౌతికముగా | **తనఖాపెట్టిన ఆస్తి యొక్క షెడ్యూల్:** రిజిస్ట్రేషన్ జిల్లా సంగారెడ్డి, రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా పటాన్‌చెరు, సంగారెడ్డి వద్ద జెడ్‌పిపి సంగారెడ్డి, ఎంపిపి అమీన్‌పూర్, జనప్రియ టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ అభివృద్ధిచేసిన హెచ్‌ఎండిఏ/ హుడా లేఖ నెం. 10843/పి4/హెచ్/07, తేదీ 29 జూన్ 2009 ద్వారా ఆమోదం తెలిపింది. తెలంగాణ రాష్ట్రం, సంగారెడ్డి జిల్లా, అమీన్‌పూర్ మం॥ మరియు అమీన్‌పూర్ సిటీ మున్సిపల్ పరిధి క్రింద అమీన్‌పూర్ వద్ద సర్వే నెంలు. 341 (పి), 342, 334(పి) & 335 (పి)లలో ఎ. 24-25.5 గుంటలలో "జనప్రియ నైల్ వ్యాలీ"లో 23.07 చ॥మీ॥లు లేదా 27.55 చ॥గ॥ల విస్తీర్ణము గల భూమి అవిభాజ్యవాటాతోపాటు బ్లాక్ నెం 3 లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో 777 చ॥అ॥ల బిల్టప్ ఏరియా మరియు 183 చ॥అ॥ల అడుగుల కామన్ సర్వీస్ ఏరియాతో పాటు, అనుపాత కామన్ ఏరియా మరియు సౌకర్యాలతో ప్రత్యేక అపార్ట్‌మెంట్ నెం. 3019లో నిర్మించబడిన స్థలం (పిటిఐఎన్ నెం. 1244112562, ఇంటి నెం. 19-3019) యావదాస్తి. భూమి సరిహద్దులు: ఉత్తరం: సర్వే నెం. 331, 332 & 333లోని పొరుగువారి భూమి, దక్షిణం: సర్వే నెం. 341(పి)లోని యజమానుల భూమి మరియు 18.2 మీటర్ల ప్రస్తుత రోడ్డు, తూర్పు: సర్వే నెం. 334(పి) & 335(పి)లలోని భూమి, పడమర: సర్వే నెం. 343లోని పొరుగువారి భూమి, ఫ్లాట్ సరిహద్దులు: ఉత్తరం: ఫ్లాట్ నెం. 3018, దక్షిణం: ఫ్లాట్ నెం. 3020, తూర్పు: ఖాళీ ప్రదేశం, పడమర: మెట్ల దారి & ఖాళీ ప్రదేశం. **తాకట్టురుణభారాలు లేవు** |

అమ్మకం యొక్క వివరణాత్మక షరతులు మరియు నిబంధనలు **కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ (www.canfinhomes.com)** లో ఏర్పాటు చేయబడును. దయచేసి దిగువ లింక్ **https://www.canfinhomes.com/SearchAuction.aspx** ను రెఫర్ చేయగలరు. ఇ-వేలంలో పాల్గొనడానికి లింక్: **www.auctionbazaar.com**

**తేది: 18-05-2026**
ప్రదేశం: రామచంద్రాపురం

సం/- అధీకృత అధికారి,
కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

# న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఎపి అగ్రగామి

**న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశ**

**యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరంలో లోకేశ్**

న్యూఢిల్లీ,మే18: ఏపీని భవిష్యత్తు న్యూక్లియర్ ఆర్థికవ్యవస్థలో నమ్మకమైన గ్లోబల్ భాగస్వామిగా నిలబెట్టడం తమ ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ప్రపంచ న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ఇది కీలకంగా మారగలదని పేర్కొన్నారు. న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్, యూఎస్–ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం సంయుక్తంగా యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా పేరిట యూఎస్ న్యూక్లియర్ ప్రతినిధులతో సోమవారం ఢిల్లీలో నిర్వహించిన సదస్సుకు మంత్రి నారా లోకేశ్ అతిథిగా హాజరై ప్రసంగించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉందని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అమలు చేస్తున్నామని అన్నారు. పారిశ్రామికీకరణలో వేగం, అమలు అత్యంత ముఖ్యమని చెప్పుకొచ్చారు. ఇందులో న్యూక్లియర్ ఎకోసిస్టమ్ ప్రముఖ పాత్ర వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తదుపరితరం రియాక్టర్ సిస్టమ్స్ వంటి ఆధునిక న్యూక్లియర్ సాంకేతికతలు, మాడ్యులర్ తయారీ, సప్లయ్ చైన్ పంపిణీ, స్కేలబుల్ వినియోగం నమూనాలకి విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి లోకేశ్ వివరించారు. భారత్‌లో ఇంజనీరింగ్ ప్రతిభ,




తయారీరంగంలో విస్తృతి, ఖర్చు విషయంలో పోటీతత్వం ఉన్నాయని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పారిశ్రామిక ఇన్‌ఫ్రా, పోర్ట్స్, లాజిస్టిక్స్ కనెక్టివిటీ, అమలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇది భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు ఒక చరిత్రాత్మక అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. ఏపీకి అనేక అదనపు ప్రయోజనాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. తమకు సువిశాలమైన తీరప్రాంతం, శక్తివంతమైన పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విస్తతమైన పారిశ్రామిక కారిడార్లు, ప్రతిష్ఠాత్మకమైన పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉందని చెప్పుకొచ్చారు. పర్యావరణ వ్యవస్థ ఆలోచనా విధానం ముఖ్యమని అన్నారు. సాంకేతిక సహకారాలు, తయారీ భాగస్వామ్యాలు, సప్లై చైన్ అభివృద్ధి, ఇంజనీరింగ్ ఎకోసిస్టమ్స్, రీసెర్చ్ భాగస్వామ్యాలు, స్కిల్లింగ్, వర్క్‌ఫోర్స్ అభివృద్ధి, పారిశ్రామిక ప్రమాణాలు, భవిష్యత్తు సాంకేతికల అమలుకు విశ్వసనీయ గ్లోబల్ భాగస్వాములతో పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి యూఎస్ ? ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ నివేదిత మెహ్రా స్వాగతం పలుకగా, న్యూక్లియర్ ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్ ప్రెసిడెంట్, సీఈవో మారియా కోర్సినిక్ హాజరయ్యారు.

# ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉండండి

## జూన్ 1నుంచి కాలువల్లోకి నీరు విడుదల

## రైతులకు మంత్రులు అచ్చన్న, రామానాయుడు భరోసా

అమరావతి,మే18: రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉండాలని, జూన్ 1 నుంచి కాలువల్లోకి సాగునీరు విడుదల చేస్తామని మంత్రులు ప్రకటించారు. ఖరీఫ్–2026 సాగునీటి విడుదలపై మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. కాలువల్లో పూడిక తొలగింపు పనులను మే చివరికి పూర్తి చేయాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. గత సీజన్‌లో 2025–26 ఖరీఫ్‌లో 99.35 లక్షల ఎకరాలకు 888 టీఎంసీల యూరియా తీసుకోవచ్చని తెలిపారు. ముందస్తు నిల్వలు వద్దని, రెండు–మూడు దశల్లో నానో యూరియా వినియోగించాలని సూచించారు. యుద్ధం కారణంగా యూరియా దిగుమతులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, అందువల్ల యూరియాను అవసరం మేరకు మాత్రమే వాడాలని రైతులకు అచ్చెన్నాయుడు సూచించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి రైతాంగాన్ని పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టిన వైసీపీ పాలకులు ఇప్పుడు రైతులపై సానుభూతితో మాట్లాడటం విడ్డూరంగా ఉ



నీటి సరఫరా చేశామని, రబీ సీజన్‌లో 23.67 లక్షల ఎకరాలకు 153 టీఎంసీల నీరు అందించామని మంత్రులు తెలిపారు. రాష్ట్ర రిజర్వాయర్లలో 461 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని వెల్లడించారు. గోదావరి డెల్టాకు జూన్ 1 నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్లు మంత్రులు ప్రకటించారు. కృష్ణా డెల్టాకు జూలై 1 నుంచి, నాగార్జున సాగర్ ఆయకట్టుకు జూలై చివరికి, కె.సి. కెనాల్‌కు జూలై 15 నుంచి, వంశధార ఆయకట్టుకు జూన్ 15 నుంచి సాగునీరు విడుదల చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు వర్చువల్ మీటింగ్ నిర్వహించారు. ఖరీఫ్–2026 ప్రణాళికలు, ఎల్ నినో ప్రభావంపై సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఎరువులు పక్కదారి పడితే అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. యూరియా సరఫరా కోసం రైతులకు ప్రత్యేక కార్డులు అందజేస్తామని, అవసరం మేరకు ఆ కార్డు ద్వారా ందని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. 'వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిన్నది. రైతులకు సరైన సమయంలో విత్తనాలు, ఎరువులు అందక ఇబ్బంది పడ్డారు. పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టపోయారు. రైతు భరోసా పేరుతో చెప్పినంత ఇవ్వకుండా మోసం చేశారని మంత్రి పేర్కొన్నారు. మామిడి రైతుల సమస్యలపై మాట్లాడే ముందు వైసీపీ హయాంలో ఉద్యాన రైతులు ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకోవాలన్నారు. వైసీపీ పాలనలో మొక్కజొన్న రైతుల పరిస్థితి దారుణంగా లేదా? కనీస మద్దతు ధర అమలులో విఫలం కాలేదా? రైతులు రోడ్లపై ఆందోళన చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకుందా? కేవలం ప్రచార రాజకీయాలు తప్ప.. రైతు సంక్షేమం పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు సంబంధించిన ప్రతి అంశంపైనా సమీక్ష చేస్తున్నాం. నిజంగా రైతుల కోసం పని చేయాలనే ఉద్దేశం వైసీపీ నేతలకు ఉంటే చౌకబారు విమర్శలు మానాలని హితవు పలికారు.

# ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా సత్వర పరిష్కారం

**జైళ్లను సంస్కరించి ఆధునీకరిస్తున్నాం**

**రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత**

**కుటుంబంతో కలసి శ్రీవారి దర్శనం**

తిరుపతి,మే18: రాష్ట్రంలో సంచలనమైన కేసులను త్వరితగతిన విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పనిచేస్తున్నాయని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. అవసరమైతే మరిన్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. జైల్ సిబ్బంది, పోలీసులు వేరన్నారు. ఖైదీల్లో పరివర్తన కోసం జైల్ సిబ్బంది వారికి దగ్గరగా ఉంటూ.. మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. జైల్ నుంచి పెరోల్‌పై వచ్చే వారిపై కూడా నిఘా ఉంచుతున్నామన్నారు. జైళ్ల శాఖలో ప్రక్షాళన చేపడతామని చెప్పారు. తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్లో హోంమంత్రి అనిత ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఉదయం సబ్ జైల్‌కు వెళ్లిన మంత్రి.. జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతులను గురించి జైల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ.. ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావడం కోసమే జైళ్లు అని చెప్పుకొచ్చారు. తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్ విస్తీర్ణం తక్కువగా ఉందని.. ఖైదీల సంఖ్య 120 ఉండాల్సింది.. 140 మంది ఉన్నట్లుగా తెలిసిందన్నారు. సబ్ జైల్ ప్రస్తుత విస్తీర్ణం 70 సెంట్లుగా ఉన్నట్లు జైలు అధికారులు చెప్పారన్నారు. దీన్ని పెంచాలా.. లేక మరోచోట నిర్మాణం చేయాలా అనేది పరిశీలిస్తామని తెలిపారు. ఖైదీల భద్రత తమ బాధ్యత అని.. ఖైదీల్లో కూడా పరివర్తన రావాలని హోంమంత్రి అన్నారు. రాజాబ్ క్యాలెండర్ ద్వారా పోలీసు, ఫైర్, జైల్ శాఖల్లో ఖాళీలు భర్తీ చేస్తున్నామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. అంతకుముందు తిరుమల శ్రీవారిని అనిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమెకు స్వాగతం పలికిన టిటిడి అధికారులు దర్శనం చేయించి, శ్రీవారి తీర్థప్రసాదాలు అందించారు. వేదాశీర్వచనం చేశారు.



## పేర్ని నాని అక్రమాలు కోకొల్లు

**నోరు జారితే జాగ్రత్త అంటూ మంత్రి హెచ్చరిక**

ఏలూరు,మే18: మాజీ మంత్రి పేర్నినానిపై మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భార్యను అడ్డుపెట్టుకొని నాని బతికిపోయారని విమర్శించారు. సోమవారం ఏలూరు జిల్లాలో మంత్రి కొలుసు పార్థసారథి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ నాయకులు పేర్నినాని, జోగి రమేశ్ నూజివీడులో నిర్వహించిన మామిడి రైతుల సదస్సులో చేసిన విమర్శలకు ఘాటుగా పార్థసారథి బదులిచ్చారు. 'కాంగ్రెస్‌లో ఉంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర రూట్ మ్యాప్ పర్యవేక్షించిన రాజకీయ వ్యభిచారి పేర్ని నాని. భార్యను అడ్డం పెట్టుకొని అవినీతి, బెదిరింపులు, అక్రమాలకు పాల్పడ్డారు. మహిళలను వేధించకూడదని సీఎం చంద్రబాబు చెప్పారు.. అందుకే పేర్ని నాని బతికిపోయారు. నాని ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి. అమరావతిపై విషం చిమ్మితే 11 సీట్ల నుంచి సున్నాకు వైసీపీ పడిపోతుంది. ప్రజలతో దొంగ మందు తాగించి అనారోగ్యం పాల్జేసి జగన్ అండ్ కో వేలకోట్లు దోచుకున్నారు' అని పార్థసారథి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తిరుమలలో పెరిగిన అటవీ విస్తీర్ణం

**టిటిడికి సిఎం చంద్రబాబు అభినందనలు**

అమరావతి,మే18: తిరుమలలో 89.4 శాతం అటవీ విస్తీర్ణం సాధించిన తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. శేషాచలం అడవుల్లో స్థానిక జాతుల పునరుద్ధరణకు టీటీడీ కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. అటవీ సంపద పరిరక్షణకు చేపట్టిన చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రకృతిని పవిత్రంగా భావించడం భారతీయ సంప్రదాయమని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ దైవసేవతో సమానమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. భవిష్యత్తు తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన తిరుమల అందించాలనే లక్ష్యంతో టీటీడీ చర్యలు చేపట్టిందని తెలిపారు. తిరుమల పర్యావరణ పరిరక్షణలో టీటీడీ చేస్తున్న కృషి అమోఘమని ప్రశంసించారు. శేషాచలం అటవీ సంపద కాపాడటంలో టీటీడీ నిరంతర చర్యలు కొనసాగాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

## మరో ఫైనాన్స్ మోసం బట్టబయలు

రాకెట్ ల్యబాబ్ పేరుతో ప్రజలకు బురిడీ
కేసు నమోదు చేసిన పోలీసులు

పల్నాడు,మే18: పల్నాడు జిల్లాలో రాకెట్ ల్యాబ్ పేరుతో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. తక్కువ మొత్తంలో డబ్బులు పెట్టుబడి పెడితే భవిష్యత్తులో విడతల వారీగా రూ.25 కోట్ల వరకు వస్తాయని నమ్మబలికి వందలాది మంది నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల్లో ఈ మోసం పెద్ద ఎత్తున జరిగింది. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రూ.3వేల నుంచి రూ.11 వేలు కడితే విడతల వారీగా రూ.25 కోట్లు వస్తాయని కేటుగాళ్లు బురిడీ కొట్టించారు. అత్యాశకుపోయి డబ్బులు కట్టి పలువురు బాధితులు మోసపోయారు. నరసరావుపేటలో 263 మంది సహా చిలకలూరిపేట మరికొందరు.. ఇలా మొత్తం సుమారు 500 మంది నుంచి కేటుగాళు డబ్బులు వసూలు చేశారు. ప్రధాన నిందితుడు చిలకలూరిపేట మండలం గొట్టిపాడుకి చెందిన వెంకట్రావుతో సహా ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసానుపల్లి వీఆర్వో ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిందితులపై కేసు నమోదైంది. నాగండ్ల వెంకట్రావు, అతని కుమారుడు వంశీ, భార్య, పీఏ నీరజలపై కూడా కేసు నమోదైంది. వీరు పలు ప్రాంతాల్లో కార్యాలయాలు ఓపెన్ చేసి మరీ దందా కొనసాగించినట్లు పోలీసులు తెలిపారు. నరసరావుపేట, చిలకలూరిపేటలో నిందితులపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## కేరళం మరింతగా పురోగమించాలి

అమరావతి,మే18: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేరళం కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. కేరళం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వీడీ సతీశన్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అలాగే మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారందరికీ శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. కేరళం నూతన ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. పారదర్శకమైన, ప్రగతిశీలమైన పాలనను అందిస్తూ కేరళం రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని పేర్కొన్నారు. దేవుని సొంత దేశంగా పేరుగాంచిన కేరళం మరింత అభివృద్ధి, సుసంపన్నత సాధించాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

# నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో అత్యధికంగా 44.3 డిగ్రీలు

**ఎపిలో మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు**

**అప్రమత్తంగా ఉండాలని వాతావణ అధికారుల హెచ్చరిక**

అమరావతి,మే18: రాబోయే మూడు రోజుల పాటు కోస్తాంధ్ర జిల్లాల్లో ఎండ తీవ్రత మరింత పెరిగి అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. పలు జిల్లాల్లో 45 నుంచి నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరించారు. సోమవారం నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో అత్యధికంగా 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, కడపలో 42.9నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు తీవ్రరూపం దాల్చడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44 నుంచి – 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. విశాఖపట్నం, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40– 42 ల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. శ్రీకాకుళం,




విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45– 47 ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. నెల్లూరు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44– 45ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 41 – 43ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45– 47ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. శ్రీకాకుళం, విశాఖపట్నం, కర్నూలు, అనంతపురం శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42– 44ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. అలాగే రేపు 47 మండలాల్లో తీవ్రవడగాడ్పులు, 88 మండలాల్లో వడగాడ్పులు, ఎల్లుండి 177 మండలాల్లో తీవ్రవడగాడ్పులు, 255 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపే అవకాశంఉందని తెలిపారు. రేపు రాష్ట్రంలోని 47 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 88 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించారు.

బుధవారం పరిస్థితి మరింత తీవ్రంగా ఉండొచ్చని, 177 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 255 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు రావద్దని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఎక్కువగా నీరు, మజ్జిగ, పండ్లరసాలు తీసుకోవాలని సూచించారు. ఎండలో పని చేసే వారు తలకు రక్షణగా టోపీ ఉపయోగించాలని వైద్య నిపుణులు సూచించారు.

## మ్యూజియాలు జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు

మొదటిపేజీ తరువాయి..

జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదను రక్షించడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం పబ్లిక్ గార్డెన్ లోని రాష్ట్ర మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలో పరమార జగద్దేవుని శాసనాలు, స్టకో స్కప్చర్స్ ఇన్ సెంటెనరీ మ్యూజియం అనే పుస్తకాలతో పాటు బ్రోషర్లను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు.

సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఒక దేశ గొప్పతనం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు అన్నీ మ్యూజియాలు, వారసత్వ సంపద ద్వారానే భావితరాలకు చేరుతాయని అన్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు లేని కాలంలో అద్భుతమైన కట్టడాలను మన పూర్వీకులు నిర్మించారని, వాటిని చూసి తరించక పోతే



జీవితం సంపూర్ణం కాదని తెలిపారు. ÷ూమప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం లభించడం తెలంగాణ చరిత్రకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చిందని, ఈ వారసత్వ కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రతిష్టాత్మకంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వారసత్వ సంపద పరిరక్షణ, మ్యూజియాల అభివృద్ధి, చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు, సందర్శకులకు మెరుగైన సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా గైడ్ లకు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని కోసం రూ. 5 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆర్కియాలజీ, మ్యూజియాలజీ రంగాల్లో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వారసత్వ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లలు, విద్యార్థులు, యువత మ్యూజియాలను సందర్శించి చరిత్రపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వరల్డ్ మన్యూమెంట్ ఫండ్ బోర్డు మెంబర్ షాలిని భూపాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, కేంద్ర పురావస్తు శాఖ సూపరి÷−టనెండెంట్ నిఖిల్ దాస్, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, ఇంటాచ్ (ఎఔ÷ంఅఊ) కన్వీనర్ అనురాధ రెడ్డి, చరిత్రకారులు డా. ఈమని శివనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రక్తసిక్తం

మొదటిపేజీ తరువాయి..

మరో 25 మందికి పైగా గాయపడ్డారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రక్కును వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. కంటైనర్ ఢీకొన్న తీవ్రతకు వాహనం పూర్తిగా దెబ్బతింది. ఘటనాస్థలిలోనే



పదిమందికి పైగా మృతిచెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉ ందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, పోలీసులు వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ విషాద ఘటనతో పెళ్లి ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది.

# మాక్ ఎక్సర్‌సైజ్

మొదటిపేజీ తరువాయి..

కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి



విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవం తంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించా రు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. ÷−రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గో÷−డలెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తుచేశారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి?కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ... విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను మంత్రి అభినందించారు. ఈ భారీ మాక్ డ్రిల్ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్‌స్టలెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితో పాటు పోలీస్,్గ ÷ర్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ , రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ , హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశు సంవర్ధక, వెటర్నరీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మాక్ డ్రిల్‌ను విజయవంతం చేశారు.

# సతీశన్ అనే నేను..

మొదటిపేజీ తరువాయి..

ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. సీఎం సతీశన్ ఆర్థిక, ఓడరేవుల శాఖలతో సహా పలు కీలక పోర్ట్‌ఫోలియోలను తనవద్దే ఉంచుకునే అవకాశం ఉంది. సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాలకు విజిలెన్స్‌తో పాటు హోం శాఖ



బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కేరళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు రెవెన్యూశాఖ కేటాయించాలని యూడీఎఫ్ నిర్ణయం తీసుకుంది. ఇకపోతే కొచ్చికి సమీపంలోని నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్‌లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. తర్వాత కాంగ్రెస్‌లో ఒక్కో మెట్టు ఎక్కుతూ ప్రజానేతగా, సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావుర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. అందుకే ప్రస్తుతం సీఎం ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన అభిప్రాయ సేకరణలో కూడా ఎమ్మెల్యేలు, ప్రజలు సతీశన్‌కే మద్దతు ఇచ్చారు.

కేరళలోనూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. కేరళం ముఖ్యమంత్రిగా సోమవారంనాడు ప్రమాణస్వీకారం చేసిన వీడి సతీశన్ తొలి క్యాబినెట్ సమావేశంలోనే కీలక సంక్షేమ, పాలనా సంబంధిత నిర్ణయాలను ప్రకటించారు. జూన్ 15వ తేదీ నుంచి మహిళలకు కేఎస్ఆర్‌టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్టు ప్రకటించారు. ఉద్యోగాలు చేసే మహిళలు, విద్యార్థినులు, రోజువారీ ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయనున్నట్టు కూడా ప్రకటించారు. వృద్ధతరం పెరుగుతుండటం, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సీనియర్ సిటిజన్ల హెల్త్‌కేర్, సామాజిక భద్రత, పునరావాసం, సంక్షేమ పథకాలను ఈ ప్రత్యేక శాఖ సమన్వయం చేస్తుందని చెప్పారు. ఆశావర్కర్ల గౌరవ వేతనాన్ని రూ.3,000కు పెంచుతున్నట్టు కూడా ముఖ్యమంత్రి సతీశన్ ప్రకటించారు. కేరళం హెల్త్‌కేర్ సిస్టంలో ఆశా వర్కర్లు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. వర్కర్లు, హెల్పర్లకు రూ.1,000 చొప్పున వేతనం పెంచుతున్నామని, పాఠశాలల్లో వంటపనులు చేస్తున్న వారు, సహాయక సిబ్బంది, ప్రీ-ప్రైమరీ టీచర్లకు అదనంగా రూ.1,000 వేతనం పెంచుతున్నామని చెప్పారు. 2023 నవ కేరళం యాత్ర సందర్భంగా యువజన కాంగ్రెస్ నేతలపై జరిగిన దాడులపై ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం సతీశన్ ప్రకటించారు. ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధించేందుకు, జవాబుదారీతనాన్ని పాదుకొలిపేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తామని, రుణాలు, వ్యయం, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై పారదర్శకతకు కట్టుబడి ఉంటామని తెలిపారు.

### జంటహత్యల కేసులో సంచలన విషయాలు

రంగారెడ్డి,మే18(సాక్ష్యం): రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ జంట హత్యల కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. నిందితుల విచారణలో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయి. తమకు అప్పు ఇచ్చిన 8 మందినీ చంపేందుకు కరీమా బేగం దంపతులు, మరో వ్యక్తి పథక రచన చేశారు. పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగుచూశాయి. హత్యకు ప్లాన్ చేసిన 8 మంది మహిళల్లో ఇద్దరిని చంపగా.. మరో ఆరుగురిని కూడా అక్కడికి ఫాంహౌస్‌కు పిలిచారు. వారు అక్కడికి వెళ్లకపోవడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఇద్దరు మహిళల హత్య ఘటన వెలుగు చూసిన తర్వాత తమకూ ప్రాణహాని ఉందంటూ ఆరుగురు మహిళలు పోలీసులను ఆశ్రయించారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆబేదాబేగం, మహబూబాబీ.. అదే కాలనీలో ఉ ండే దంపతులు కరీమాబేగం, రెహమాన్, వీరి బంధువు నయాంకు వేర్వేరుగా కొంత డబ్బు అప్పుగా ఇచ్చారు. చాలారోజులు అవడంతో డబ్బులు తిరిగివ్వాలని వారిపై మహిళలిద్దరూ ఒత్తిడి తెచ్చారు. దీంతో వారిని చంపేయాలని కరీమాబేగం, రెహమాన్, నయాం పథకం వేశారు. డబ్బు ఇస్తామని నమ్మించి ముందుగా మహబూబాబీని మొయినాబాద్ సమీపంలోని తోల్కట్ట ఫాంహౌస్ వద్దకు తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేసి, అక్కడే గొయ్యి తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ఆ తరువాత ఆబేదాబేగంను కూడా అక్కడికే తీసుకెళ్లి అదేరీతిలో హత్య చేసి పాతిపెట్టారు. నిందితుల సమాచారంతో తాండూరు గ్రామీణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యాలాల ఎస్సై విఠల్‌రెడ్డి, బషీరాబాద్, చేవెళ్ల, మొయినాబాద్ పోలీసు సిబ్బంది చేరుకొని తవ్వకాలు చేపట్టగా మహబూబాబీ అస్థిపంజరం బయటపడింది. తరువాత ఆబేదాబేగం మృతదేహాన్ని వెలికితీశారు.

## ఈపీసెట్ 2026లో ఎంజేపి విద్యార్థుల హవా

మొదటిపేజీ తరువాయి..

విద్యార్థులు క్వాల్గి÷ అయ్యారు. వీరిలో ఐదువేల లోపు ర్యాంక్ 46మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ 178 మంది విద్యార్థులు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హర్షిణి (516వ



ర్యాంక్), కల్పిత (1315 ర్యాంక్), కె. శ్రవణ్ కుమార్ (1377 ర్యాంక్), టి. నవ్య(1692 ర్యాంక్) అత్యుత్తమ ర్యాంక్ సాధించగా, ఇంజనీరింగ్ విభాగంలో బి. అనిరుధ్ (3513 ర్యాంక్ ), జి. వినోద్ కుమార్ (3568 ర్యాంక్ ), ఎన్. రుషిక్ వర్మ (4433 ర్యాంక్) సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో మొత్తం 1626 మంది ఎంజెపి విద్యార్థులు క్వాల్గి÷ కాగా వీరిలో ఐదు వేల లోపు ర్యాంక్ సాధించిన వారు 43 మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ సాధించిన వారు 122 మంది విద్యార్థులు ఉన్నారు. 20000 లోపు ర్యాంక్ 247 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 703 మంది విద్యార్థులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 2155 మంది విద్యార్థులు క్వాల్గి÷ కాగా వారిలో 5000 లోపు ర్యాంక్ ముగ్గురు విద్యార్థులు, 10000 లోపు ర్యాంక్ 56 మంది విద్యార్థులు, 20000 లోపు ర్యాంక్ 167 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 412 మంది విద్యార్థులు సాధించారు. ఉన్నత విద్యా కోర్సుల్లో చేరేందుకు అరజత సాధించిన విద్యార్థులను, బోధన సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, ముఖ్య కార్యదర్శి బాల మాయా దేవి గారు, ఎం జె పి కార్యదర్శి బడుగు సైదులు గారు అభినందించారు. ఈ ఫలితాలు బీసీ గురుకుల విద్యాసంస్థల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ప్రత్యేక శిక్షణ, క్రమశిక్షణకు నిదర్శనంగా నిలుస్తున్నాయని వారు కొనియాడారు. ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు మెరుగు పరిచామని, ప్రత్యేక ఆన్ లైన్ కోచింగ్ ద్వారా విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల శిక్షణ అందిస్తున్నామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ మాత్రమే ఉండగా గత ఏడాది కొత్తగా పది సిఓఇలు లు, ఈ ఏడాది మరో పది సిఓఇలు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఏడాది మరింత ఎక్కువ సంఖ్యలో బీసీ గురుకుల విద్యార్థులు ఉన్నత విద్యా కోర్సులకు శిక్షణ తీసుకుని అత్యుత్తమమైన ఫలితాలు సాధిస్తారని ఆయన ఆకాంక్షించారు.

## నగరంలో అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలు

మొదటిపేజీ తరువాయి..

శతజయంతి ట్రైబల్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన కుమ్రం భీమ్, సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశంలోని ప్రతి రాష్ట్రంలో సాధారణంగా ఒక్క గిరిజన మ్యూజియం మాత్రమే ఉండగా, తెలంగాణ రాష్ట్రంలో ఆరు గిరిజన మ్యూజియంలు ఏర్పాటుచేయడం గర్వకారణమని పేర్కొన్నారు. వేగంగా మారుతున్న ఆధునిక సమాజంలో గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, విలువలు తదితర వారసత్వ సంపదను భావితరాలకు పరిచయం చేసే ప్రధాన వేదికలుగా మ్యూజియంలు నిలుస్తాయని అన్నారు. అలాగే కుమ్రం భీమ్, రాంజీ గోండ్ వంటి గిరిజన వీరులు ప్రజల హక్కులు, స్వేచ్ఛ, స్వాభిమానాల కోసం చేసిన పోరాటాలు, త్యాగాలు తదితర చారిత్రక అంశాలను యువతకు తెలియజేయడంలో గిరిజన మ్యూజియంలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు, యువత ఆసక్తిగా నేర్చుకునే విధంగా గిరిజన మ్యూజియం లను ఇంటరాక్టివ్, డిజిటల్ మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే నవంబర్ 15 నాటికి రాంజీ గోండ్ స్మారక గిరిజన స్వాతంత్య సమరయోధుల మ్యూజియంను అత్యాధునిక హంగులతో పూర్తి చేసి, ప్రధానమంత్రిని ఆహ్వానించి ఆవిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ సముజ్వల, మ్యూజియం క్యురేటర్ సత్యనారాయణతో పాటు ఇతర అధికారులు, ఉ ద్యోగులు పాల్గొన్నారు.

## అన్నమాచార్య జయంతి ఉత్సవాల్లో కుమారి నిత్యశ్రీ కూచిపూడి నృత్యానికి విశేష స్పందన

– తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఘనంగా నిర్వహించిన ఆదర్శ కళా నిలయం కార్యక్రమం




హైదరాబాద్, మే 17, 2026: తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఆదర్శ కళా నిలయం ఆధ్వర్యంలో పదకవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్య 618వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత, సాహిత్య, నృత్య కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన శ్రీ వశిష్ఠ నృత్య కళా భారతి విద్యార్థిని కుమారి నిత్యశ్రీ అందించిన కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ నాట్య గురువు కే దశరథ్ శిక్షణలో ఆమె అన్నమయ్య సంకీర్తనలకు అనుగుణంగా ప్రదర్శించిన భావప్రధాన నృత్యం సభికుల ప్రశంసలు అందుకుంది. చిన్న వయసులోనే నృత్యంలో ప్రతిభ కనబరిచిన నిత్యశ్రీ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని పలువురు కళాభిమానులు అభినందించారు. ఆమె అభినయం, నాట్య కదలికలు, భావ వ్యక్తీకరణ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పలువురు కళాకారులు భక్తి సంగీతం, సాంప్రదాయ నృత్య ప్రదర్శనలతో అలరించారు. తెలుగు సంస్కృతి, సాహిత్య సంపదను భావితరాలకు పరిచయం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమావేశం నిర్వహణ

కార్మిక హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తాం





సికింద్రాబాద్, మే 18 (సాక్ష్యం): బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి సమావేశం సోమవారం రవీంద్రభారతి సమీపంలోని బీసీ ఫెడరేషన్ హాలులో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ డిపోల నుంచి యూనియన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొని సంస్థ భవిష్యత్ కార్యాచరణ, కార్మిక సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా బహుజన వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ మాట్లాడుతూ, ఆర్టీసీలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అణగారిన, వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో బహుజన వర్కర్స్ యూనియన్ ఏర్పాటై ఎన్నో సంవత్సరాలుగా పోరాటాలు చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. 56 రోజుల ఆర్టీసీ సమ్మె సమయంలో అప్పటి ప్రభుత్వ పాలనలో కార్మికుల సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేకపోయినా, బహుజన వర్కర్స్ యూనియన్ ముందుకొచ్చి కార్మికుల తరఫున పోరాటం చేపట్టిందని గుర్తు చేశారు. ఆర్టీసీలో కార్మికులపై వేధింపులు, సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో వివిధ యూనియన్లను ఒకే వేదికపైకి తీసుకువచ్చి జేఏసీగా ఏర్పడి ధర్నాలు, ర్యాలీలు తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెకు పిలుపునిచ్చి రాష్ట్రవ్యాప్తంగా డిపోల వారీగా కార్మికులను సమీకరించి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లినట్లు వివరించారు. అనంతరం ప్రభుత్వం స్పందించి మంత్రివర్గంతో చర్చలు జరిపిందని, ఆ సమయంలో జరిగిన పరిణామాలను సమావేశంలో వివరించారు. తన ప్రసంగంలో భాగంగా ఇటీవల వచ్చిన ప్రతిపాదనపై కూడా సుద్దాల సురేష్ ప్రస్తావించారు. సమాన లక్ష్యాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలోని ప్రజా రాజ్యాధికార పార్టీతో కలిసి అనుబంధంగా పనిచేస్తూ ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటాలు చేపడితే మంచి ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదనపై సమావేశానికి హాజరైన సభ్యులు తమ అభిప్రాయాలు వెల్లడించగా, అనంతరం సుద్దాల సురేష్ ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో సంపత్, సాయికిరణ్, సాజిద్, నరేందర్, రవికిరణ్, కుమార్, శ్రీనివాస్, నర్సింహ, మాణిక్యం, సత్యనారాయణ, రామచంద్రతో పాటు వివిధ డిపోల నుంచి పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

## నాచారంలో అక్రమ రేషన్ బియ్యం దందాపై ఎస్‌వోటీ దాడి

– 21 క్వింటాళ్ల సన్నబియ్యం స్వాధీనం





ఉప్పల్, మే 18: (సాక్ష్యం).. నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ సన్నబియ్యాన్ని ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం దుర్గానగర్ ప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో సుమారు 21 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని నాచారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, దుర్గానగర్‌కు చెందిన రేషన్ షాప్ నంబర్ 3302102 నిర్వాహకుడు భూక్య వెంకట్ అక్రమంగా రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్నట్లు ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఎస్‌వోటీ ఎస్ఐ వాసుదేవ్ ఆధ్వర్యంలోని బృందం పర్యవేక్షణ చేపట్టింది. తనిఖీల్లో తుర్కపల్లి మండలం కేతులావత్ తండాకు చెందిన దరవత్ శ్రీనుకు 21 క్వింటాళ్ల సన్నబియ్యాన్ని విక్రయిస్తున్న సమయంలో నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకుని నాచారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టినట్లు నాచారం పోలీసులు వెల్లడించారు. అక్రమ రేషన్ బియ్యం వ్యాపారాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## క్రీడలు యువతలో మానసిక ఉల్లాసాన్ని నింపుతాయి: ఎమ్మెల్యే జిఎస్ఆర్

భూపాలపల్లి సాక్ష్యం న్యూస్: మే 18 జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే రన్ ఉత్సాహంగా సాగింది. భూపాలపల్లి హనుమాన్ ఆలయం నుంచి కృష్ణా కాలనీ అంబేద్కర్ గ్రౌండ్ వరకు నిర్వహించిన ఈ రన్‌లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. క్రీడలు యువతలో మానసిక ఉల్లాసాన్ని నింపడంతో పాటు శారీరక దృఢత్వం, ఆలోచనా శక్తిని పెంచుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యువత ప్రతిరోజూ క్రీడల్లో పాల్గొని క్రమశిక్షణ, ఐక్యత, పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం యువత ప్రతిభను ప్రోత్సహించేందుకు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, జిల్లా క్రీడల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# దేవుడి సొమ్ముకు కాపలా ఎవరు..?

– దేవాదాయ శాఖలో 3 ఏళ్లుగా “ ఇన్‌చార్జ్ రాజ్యం “

– రూల్స్ తుంగలో తొక్కి ఐఏఎస్ లేకుండా కమీషనర్ పోస్ట్..! – కోట్ల ఆదాయం ఉన్న గుడులపై రాజకీయ పెత్తనం..?



మార్కాపురం జిల్లా బ్యూరో : సాక్ష్యం దేవుడి సొమ్ము – దొంగల పాలు..! దేవాదాయ శాఖలో 1095 రోజులుగా రాజ్యాంగ హత్య.. ఐ.ఏ.ఎస్.లేకుండా,కోర్టు తీర్పు లేకుండా,లెక్క లేకుండా నడుస్తున్న వేల కోట్ల సామ్రాజ్యం.. దేవుడి ఆస్తులకు వారసులం కాదు, కాపలాదారులం మాత్రమే “ అని ప్రమాణం చేసి గద్దెనెక్కిన ప్రభుత్వమే,దేవుడి సొమ్మును 3 ఏళ్లుగా రాజ్యాంగ విరుద్ధంగా,కోర్టు ధిక్కారంతో దోచుకుతింటోంది అనడానికి ఇదిగో సాక్ష్యం..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 24,000 దేవాలయాలు,రూ. 80,000 కోట్ల విలువైన భూములు,రోజుకు వందల కోట్ల హుండీ ఆదాయం ఇంతటి సంపదను కాపాడాల్సిన దేవాదాయ శాఖ కమీషనర్ పోస్ట్ గత 3 ఏళ్లుగా “ ఇన్‌చార్జ్ “ పాలనలో నడుస్తోంది.ఆంధ్రప్రదేశ్ ఎండోమెంట్స్ యాక్ట్,1987కు విరుద్ధంగా సీనియర్ ఐ.ఏ.ఎస్. అధికారిని నియమించకుండా,డిప్యూటీ కమీషనర్ కేడర్ అధికారి కె.రామచంద్ర మోహన్‌కు “ ఫుల్ అడిషనల్ ఛార్జ్ “ ఇచ్చి కొనసాగిస్తున్నారు.

**హైకోర్టు ఆదేశాలు బేఖాతరు..**

డబ్ల్యూ.పి.నెంబర్ 18762/2023 లో హైకోర్టు స్పష్టంగా చెప్పింది.” కమీషనర్ పోస్ట్‌ను 6 నెలలకు మించి ఇన్‌చార్జ్‌తో నడపడం చట్ట విరుద్ధం. వెంటనే రెగ్యులర్ ఐ.ఏ.ఎస్ .ను నియమించాలి “ కానీ 2023 నుంచి ఇప్పటివరకు ఆ తీర్పును ప్రభుత్వం అమలు చేయలేదు.కోర్టు ధిక్కారమే కాదు,ఇది లక్షలాది హిందూ భక్తుల మనోభావాలతో చెలగాటం..

**ఇన్‌చార్జ్ పాలనతో రాజకీయ నాయకులకు లాభం ఏంటి..?**

ఉద్యోగ సంఘాల ఆరోపణల ప్రకారం “ ఇన్‌చార్జ్ రాజ్యం “ వల్ల జరుగుతున్న నష్టాలు ఇవి...

**ఇన్‌చార్జ్ పాలనలో జరిగిన “ అద్భుతాలు “ ఇవి**

తిరుమల ఈ.వో.పోస్ట్ : గత 2 ఏళ్లలో 3 సార్లు ఈ.వో.లు మారారు.ఒక్కో పోస్టింగ్ వెనుక “ చీకటి ఒప్పందం “ ఉందని ఉద్యోగ సంఘాల బహిరంగ ఆరోపణ.

**1000 ఎకరాల భూముల లీజు :**

రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయ భూములను “అభివృద్ధి” పేరుతో 33 ఏళ్లకు లీజుకు ఇచ్చారు.రేటు ఎంత..?ఎవరికి ఇచ్చారు..? ఫైళ్లు గోప్యం...

**కాణిపాకం హుండీ లెక్కింపు :**

లెక్కింపులో అవకతవకలు జరిగాయని సొంత సిబ్బందే ఆరోపిస్తే,విచారణ లేకుండా ఫైల్ క్లోజ్ చేశారు...

**1.ఈ.వో.పోస్టుల అమ్మకం :**

తిరుమల,శ్రీశైలం, అన్నవరం,సింహాచలం,కాణిపాకం లాంటి కోట్లు ఆదాయం ఉన్న గుడుల ఈ.వో. పోస్టింగులకు “ రేటు “ ఫిక్స్ చేశారని బహిరంగ ఆరోపణ.రెగ్యులర్ కమీషనర్ అయితే రూల్స్ ప్రకారం సీనియారిటీ చూస్తారు.ఇన్‌చార్జ్ అయితే “ పై నుంచి వచ్చిన లిస్ట్ “కు సంతకం పెడతారు.

**2.భూముల దందా :**

దేవాదాయ భూముల లీజులు,షాపుల వేలం, కాంట్రాక్టులు ఇన్‌చార్జ్ హయాంలోనే వేగంగా క్లియర్ అవుతున్నాయి.జవాబుదారీతనం లేకపోవడంతో అడిగేవాడు లేడు..

**3.ఫైల్స్ పెండింగ్ :**

కీలక పాలసీ నిర్ణయాలు,గుడుల అభివృద్ధి ఫైల్స్ తీసుకునే అధికారం ఇన్‌చార్జ్‌కు పూర్తిగా ఉండదు.దాంతో వేల కోట్ల అభివృద్ధి పనులు ఆగిపోయాయి.భక్తుల సొమ్ము బ్యాంకుల్లో మూలుగుతోంది.

**4.తప్పు చేస్తే శిక్ష ఎవరికి..? :**

రేపు ఏదైనా కుంభకోణం బయటపడితే “ నేను ఇన్‌చార్జ్ మాత్రమే,నాకు పూర్తి అధికారాలు లేవు “ అని తప్పించుకునే వెసులుబాటు.అసలు దోషులను పట్టుకోవడం కష్టం..

**భక్తులు అడగాల్సిన 3 ప్రశ్నలు :**

1.దేవుడి సొమ్మును కాపాడాల్సిన పోస్ట్‌లో 3 ఏళ్లుగా రెగ్యులర్ ఐ.ఏ.ఎస్ .ను ఎందుకు వేయడం లేదు..? 2.హైకోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయనంత “ అవసరం “ ఇన్‌చార్జ్ పాలనతో ఎవరికి ఉంది..? 3.తిరుమల లడ్డు కాంట్రాక్టు నుంచి చిన్న గుడి కొబ్బరికాయల టెండర్ వరకు అన్నీ “ పారదర్శకంగా “ జరుగుతున్నాయని ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేస్తుందా..? డిమాండ్ ఏంటి..? 24 గంటల్లో ఇన్‌చార్జ్ పాలన రద్దు చేసి, సీనియర్ ఐ.ఏ.ఎస్. అధికారిని ఫుల్ టైం కమీషనర్‌గా నియమించాలి.. గత 3 ఏళ్లలో ఇన్‌చార్జ్ హయాంలో జరిగిన ఈ.వో. పోస్టింగులు,భూముల లీజులు,టెండర్ల పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి..హైకోర్టు ఆదేశాలను ధిక్కరించిన అధికారుల పై కోర్టు ధిక్కరణ కేసు పెట్టాలి.. దేవాదాయ శాఖ అంటే దేవుడి సొమ్ము.అది ప్రజల సొమ్ము.” ఇన్‌చార్జ్ “ పేరుతో రాజకీయ అంగడి సరుకుగా మార్చితే హిందూ సమాజం చూస్తూ ఊరుకోదు.భక్తుల కానుకలకు లెక్క చెప్పాల్సిన బాధ్యత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానిదే.మహానాడు వర్చువల్‌గా నిర్వహించాలన్న సీఎం ఆదేశాలు బేఖాతరు – దేవాదాయ శాఖ ఇంఛార్జీ అధికారి నిర్లక్ష్య వైఖరి పై విమర్శలు..

“ ప్రధానితో,సీఎంతో నాకేంటి – ఐ డోంట్ కేర్ “ అన్న వ్యాఖ్యలు కలకలం – రెగ్యులర్ ఐ.ఏ.ఎస్ ను నియమించాలని డిమాండ్..దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పొదుపు మంత్రాన్ని అనుసరించి, రాష్ట్రవ్యాప్తంగా “ మహానాడు “ కార్యక్రమాలను వర్చువల్‌గా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.ప్రభుత్వ ధనాన్ని ఆదా చేసే ఉద్దేశంతో సీఎం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అన్ని శాఖలు తూచా తప్పకుండా పాటిస్తున్నాయి.అయితే దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనర్ కార్యాలయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రేపు అనగా 19 మే 2026న కమీషనర్ కార్యాలయంలో జరగాల్సిన సమీక్షా సమావేశాన్ని వర్చువల్‌గా నిర్వహించాలని సూచించగా,ప్రస్తుతం ఇంఛార్జీ బాధ్యతల్లో ఉన్న అధికారి అందుకు నిరాకరించినట్లు సమాచారం.

**“ ఐ డోంట్ కేర్ “ వ్యాఖ్యలు కలకలం**

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, సదరు ఇంఛార్జీ అధికారి “ దేశ ప్రధానితో, సీఎం చంద్రబాబుతో నాకేంటి,ఐ డోంట్ కేర్ “ అనే అర్థం వచ్చేలా వ్యాఖ్యానించి,ఫిజికల్ మీటింగ్‌కే మొగ్గు చూపినట్లు తెలిసింది.ఈ వ్యాఖ్యలు ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.ఈ అంశం పై ప్రిన్సిపల్ సెక్రటరీ,దేవాదాయ శాఖ,చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లేందుకు ఫిర్యాదులు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి..!

## ఐఐసీటీ ఉద్యోగ పరీక్షలో హైటెక్ మాల్‌ప్రాక్టీస్ రాకెట్ బట్టబయలు: 12 మంది అరెస్ట్







నాచారం, మే 18 (సాక్ష్యం): మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన సిఎస్ఐఆర్––ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ ఉద్యోగ నియామక పరీక్షలో సంఘటిత మాల్‌ప్రాక్టీస్ రాకెట్‌ను నాచారం పోలీసులు ఛేదించారు. అత్యాధునిక రహస్య ఎలక్ట్రానిక్ పరికరాల సహాయంతో పరీక్షలో అక్రమాలకు పాల్పడుతున్న 12 మంది అభ్యర్థులను పోలీసులు అరెస్ట్ చేసి భారీగా ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మే 17న స్నేహపురి కాలనీలోని సెయింట్ పియస్ ఎక్స్ డిగ్రీ, పీజీ అండ్ ఎంబీఏ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంఎటీఎస్) పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షలో కొంతమంది అభ్యర్థులు అనుమానాస్పదంగా ప్రవర్తించడం గుర్తించారు. వెంటనే నాచారం పోలీస్ స్టేషన్ సిబ్బంది, సిఎస్ఐఆర్–ఐఐసీటీ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు.మొదట మందీప్ అనే అభ్యర్థి వద్ద రహస్య ఎలక్ట్రానిక్ పరికరాలు బయటపడగా, అనంతర విచారణలో మొత్తం 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన వారి నుంచి మైక్రో, నానో ఇయర్‌ఫోన్లు, స్పై జీఎస్ఎం కమ్యూనికేషన్ పరికరాలు, మార్పు చేసిన మొబైల్ ఫోన్లు, సిమ్ ఆధారిత రహస్య కమ్యూనికేషన్ పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను స్వాధీనం చేసుకున్నారు.ప్రాథమిక విచారణలో అరెస్టు అయిన వారిలో పలువురు హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులుగా గుర్తించారు. వీరు హర్యానాలోని “మైండ్ క్యూ టైపింగ్” సంస్థ ద్వారా శిక్షణ పొందినట్లు, బయట ఉన్న హ్యాండ్లర్ల సహాయంతో ప్రశ్నాపత్రాలను స్కాన్ చేసి సమాధానాలు అందుకుంటూ పరీక్షలో మోసానికి పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో అభ్యర్థుల నుంచి రూ.1 లక్ష నుంచి రూ.8 లక్షల వరకు వసూలు చేసిన ఆర్థిక లావాదేవీల అంశాలు కూడా వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.పోలీసుల విచారణలో అభ్యర్థులు చెవుల్లో మైక్రో స్పై ఇయర్‌ఫోన్లు దాచుకోవడం, శరీరానికి రహస్య కమ్యూనికేషన్ పరికరాలను అమర్చుకోవడం ద్వారా పరీక్షలు రాసినట్లు గుర్తించారు. కొందరు అభ్యర్థులు ప్రశ్నాపత్రాలను మార్పు చేసిన మొబైల్ పరికరాల ద్వారా బయట ఉన్న హ్యాండ్లర్లకు పంపగా, అక్కడి నుంచి సమాధానాలు తిరిగి పంపించి వాటిని వినిపించే విధానాన్ని అనుసరించినట్లు వెల్లడైంది. ఈ ఘటనపై నాచారం పోలీసులు కేసు నంబర్ 242/2026గా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తెలంగాణ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పరారీలో ఉన్న మిగతా నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని, కేసు మల్కాజ్‌గిరి కమిషనరేట్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## విద్యుత్ కార్మికుల సమస్య పరిష్కారానికి 1104 యూనియన్ ముందంజ (విద్యుత్ కార్మికుల ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు)



చండూర్ .(సాక్ష్యం) మే 18 తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో చండూర్ సబ్ స్టేషన్ ఆవరణలో సోమవారం మేడే ను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డివిజన్ కోశాధికారి యం.డి.షరీఫ్ పాష మేడే జండా ను ఆవిష్కరించినారు. జెండా ఆవిష్కరణ అనంతరం బాణాసంచాలతో మేడే సంబురాలు జరిపారు.అనంతరం ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన 1104 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా కార్యదర్శి ఎన్. వెంకటయ్య హాజరై మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీల తో సంబంధం లేకుండా నిరంతరం విద్యుత్ కార్మికుల సమస్యలపై పోరాడే ఏకైక యూనియన్ 1104 యూనియన్ అని అలాగే సంస్థలో విద్యుత్ కార్మికులు నిరంతరం కష్టపడి 24 గంటలు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారని, ఆర్టిజన్ కార్మికులకు గ్రేడ్ ల వారీగా ప్రమోషన్లు కల్పించాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతన సవరణ చేయాలని, విద్యుత్ కనెక్షన్ల సంఖ్య పెరిగి లైన్ మెన్ లపై అధిక పని భారం పడుతుందని క్షేత్రస్థాయిలో జూనియర్ లైన్ మాన్ ల పోస్టులు భర్తీ చేసి పని భారం తగ్గించాలని, విద్యుత్ సంస్థలో పని చేస్తున్నటువంటి కార్మికులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. సమావేశానంతరం డివిజన్ కోశాధికారి షరీఫ్ పాష ఆధ్వర్యంలో జిల్లా నాయకులను, డివిజన్ నాయకులను షాలువలతో ఘనంగా సత్కరించినారు.ఇట్టి కార్యక్రమంలో నల్లగొండ జిల్లా కార్య నిర్వహణ అధ్యక్షులు,డివిజన్ కార్యదర్శి టి.శ్రీనివాసులు, డివిజన్ అధ్యక్షులు రాంబాబు,డివిజన్ అదనపు కార్యదర్శి ఆర్.బాలు నాయక్, డివిజన్ కోశాధికారి యం.డి. షరీఫ్ పాష,డివిజన్ జాయింట్ కార్యదర్శి లింగయ్య, డిస్కం ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.ముత్తయ్య, చండూర్ సెక్షన్ లీడర్ షజ్జు పాష, సబ్ డివిజన్ లీడర్ అశోక్, ఎల్లేశం, ముత్యంరెడ్డి, దోటి శ్రీను, యం.వెంకన్న, సైదులు, యాసిన్, రమేష్, అద్దంకి వెంకన్న, సురేష్ రెడ్డి, మీటర్ రీడర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎప్‌సెట్‌లో ఎన్ఆర్ఎస్ విద్యార్థుల ప్రతిభ






**కోదాడ, మే 18, (సాక్ష్యం)** ఎప్ సెట్ ఫలితాలలో కోదాడ పట్టణానికి చెందిన ఎన్ఆర్ఎస్ కాలేజ్ విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు చైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కాలేజ్ కు చెందిన మండవ శ్రీశశి 1858 ర్యాంకు సాధించగా, పొనగండ్ల పల్లవి 2341 ర్యాంకు, లక్కం రక్షిత 3130 ర్యాంక్, పొందూరు అమృత సుధావర్షిణి 4849 ర్యాంకులు సాధించారు. వీరితో పాటు చలికంటి త్రివేణి 9117 , రెహానా భాను 11386, భుక్య లక్ష్మీపార్వతి 12361, ఆంగోటు మేఘన 14270, బొజ్జ గణేష్ 14685, పులి రితిక 14696 ర్యాంకులు సాధించినట్లు కాలేజ్ చైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి తెలిపారు. వీరు కాక మరో 6గురు విద్యార్థులు 20వేల లోపు ర్యాంకులు సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కాలేజ్ లో జరిగిన కార్యక్రమంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను చైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి, డైరెక్టర్ మనోహర్ రెడ్డి, కరస్పాండెంట్ వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ గంధం వెంకటరమణ , అకడమిక్ అడ్వైజర మైనం రామయ్యలు అభినందించారు. తమ కాలేజ్ కు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పీ ఎన్ ఆర్, లెక్చరర్ నటరాజ్, క్యాంపస్ ఇంచార్జ్ లు మౌనిక, ప్రవీణ్, పలువురు లెక్చరర్లులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ దాడి

– 10 మంది అరెస్ట్.. రూ.1.91 లక్షల నగదు స్వాధీనం



**హనుమకొండ 18 మే (సాక్ష్యం)** హనుమకొండలోని సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్ ఫోర్స్ పోలీసులు నిర్వహించిన దాడిలో పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1,91,150 నగదు, 10 మొబైల్ ఫోన్లు, పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టాస్క్ ఫోర్స్ బృందానికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు హనుమకొండ ఇందిరానగర్‌లోని రవీందర్ ఇంట్లో కొందరు పేకాట ఆడుతున్నట్లు తెలిసింది. దీంతో టాస్క్ ఫోర్స్ బృందం అక్కడికి చేరుకుని ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. సోదాల అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదు, మొబైల్ ఫోన్లు, పేకాట సామగ్రిని తదుపరి చర్యల నిమిత్తం సుబేదారి పోలీసులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఎసిపి మధుసూధన్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ బాబులాల్, ఆర్ఎస్ఐ భాను ప్రకాష్, ఎస్ఐ ఉప్పలయ్యతో పాటు టాస్క్ ఫోర్స్ సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు..

## ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

– వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**హనుమకొండ 18 మే (సాక్ష్యం)** ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రతి సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నందు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో కమిషనరేట్ నలుమూలల నుండి తమ సమస్యలను పోలీస్ కమిషనర్ కి ఫిర్యాదుదారులు స్వయంగా తెలియజేశారు. సమస్యలను విన్న పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చి శాశ్వత పరిష్కారాలు చూపాలని, బాధితుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడు పోలీసుల పట్ల నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ఈరోజు పోలీసు ముఖ్య కార్యాలయంలో దాదాపు 10 ఫిర్యాదులను సేకరించడం జరిగింది. వచ్చిన ఫిర్యాదులలో కుటుంబ సమస్యలు, భార్యాభర్తల సమస్యలు, కేసుల పురోగతి, భూ సమస్యలు, తదితర విషయాలు ఉన్నట్లు సీపీ తెలిపారు. కమిషనరేట్ వ్యాప్తంగా అసంఘిక కార్యకలాపాలపై ఎలాంటి సమాచారం ఉన్న 8712685257 నంబర్ కు వాట్సప్ ద్వారా తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

– సంజోష్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం






**ఏటూరునాగారం, మే 18, (సాక్ష్యం)** : స్వచ్ఛంద సేవలు చేయడమే గొప్ప సేవ అలాంటిది పుట్టిన గడ్డకు ఏదో రకంగా సేవలందించాలనే దృక్పదంతో ముందుకొచ్చిన హీరో సంజోష్ ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి వాసి. గత రెండు దశాబ్దాల క్రితం హైదరాబాద్ సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టి బేవర్స్ సినిమాతో తనకంటూ ఓ పేరు సంపాదించుకున్నాడు. అలా ఇండస్ట్రీలో కొనసాగుతూ తనకంటూ ఓ ప్రత్యేక స్థానం కావాలనే దృడసంకల్పంతో తన పేరిట చారిటబుల్ ట్రస్ట్ ప్రారంబించాడు. తనకున్న పరిచయాలతో కంటి సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు శంకర్ ఐ కేర్ హైదరాబాద్ వారి వద్ద వందల మందికి కంటి పరిక్షలు చేయించి వారికి నేత్రదాతగా మారాడు. అంతేకాకుండా తన స్వంత ఊరికి సహాయం చేయాలనే ఆలోచనతో విద్యలో ఉత్తీర్ణత సాదించిన నిరుపేద విద్యార్థులకు తన వంతుగా సంజోష్ స్వచ్ఛంద సేవా కార్యక్రమం ద్వారా ఆర్థిక పారితోషకం అందించి ప్రోత్సహానిచ్చారు.

**విద్యార్థులను ప్రోత్సహించిన హీరో సంజోష్ ఫౌండేషన్**

ఏటూరునాగారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో హీరో సంజోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరంలో 10 వ తరగతి, ఇంటర్ ఫలితాలలో ఉత్తీర్ణత సాదించిన విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ బట్, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్దార్థ్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యారంగంలో ఉన్నత శిఖరాలను అదిగమించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అంతేకాకుండా విద్యార్థులు ఈ దశలోనే వేరే చెడు వ్యసనాలకు అంటే మొబైల్ రీల్స్, మాధక ద్రవ్యాలకు వ్యసనపడకూడదని, ప్రేమ పేరుతో భవిషత్ ను అంధకారం చేసుకోకుండా ఓ లక్ష్యాన్ని ఎంచుకుని చదువితో మీ స్థాయి తార స్థాయికి చేరుతుందని అన్నారు. అనంతరం సంజోష్ ఫౌండేషన్ ద్వారా 5 వందల పై మార్కులు సాధించిన పదవ తరగతి విద్యార్థులు 60 మందికి 2 వేల ఆర్థిక సహాయం, ఉంటర్ లో 9 వందల పై మార్కులు సాధించిన విద్యార్థులకు 2 వేల చొప్పున 12 మందికి, కరాటేలో నేషనల్ స్థాయి పోటీలకు ఎంపికైన వసంత విశాల్ సాయికి 5 వేల ఆర్థిక ప్రోత్సాహక బహుమతులు అందజేసి వారి సేవా దృక్పదాన్ని చాటుకున్నారు. విద్యార్థులలో ఇలాంటి ప్రోత్సాహాన్ని అందించిన సంజోష్ ఫౌడేషన్ చైర్మన్ హీరో సంజోష్ ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో హైకోరట్ అడ్వకేట్ పూజారి నాగేశ్వరరావు, హీరో సంపూర్నేష్ బాబు, డీఏవో శ్రీనివాస్, ఏంఈవో కోయడ మల్లయ్య, హెచ్ ఎం సాంబశివుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రమాదాల వేళ ప్రాణనష్ట నివారణే ప్రథమ కర్తవ్యం: కలెక్టర్ చంద్రశేఖర్

– పారిశ్రామిక ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

– వియాష్ సైంటిఫిక్ లిమిటెడ్ పరిశ్రమలో ప్రమాదాలపై మాక్ డ్రిల్ – పారిశ్రామిక విపత్తుల నిర్వహణలో నల్గొండ జిల్లా ముందంజ









**చిట్యాల మే 18(సాక్ష్యం);** పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించినప్పుడు మనల్ని మనం రక్షించుకుంటూనే, తోటివారి ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు .జాతీయ,రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థల ఆదేశాల మేరకు సోమవారం నల్గొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వియాష్ సైంటిఫిక్ లిమిటెడ్ పరిశ్రమలో పారిశ్రామిక ప్రమాదాల నివారణ, అత్యవసర ప్రతిస్పందనపై"నమూనా విన్యాసం"(మాక్ డ్రిల్) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో వరదలు,అటవీ అగ్ని ప్రమాదాలు, పారిశ్రామిక విపత్తులు సంభవించినప్పుడు జిల్లా యంత్రాంగాల సంసిద్ధతను పరీక్షించేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా పారిశ్రామిక ప్రమాదాల ప్రతిస్పందన విభాగంలో నల్గొండ జిల్లా ఎంపిక కావడం వల్ల ఈ నమూనా విన్యాసాన్ని ఇక్కడ నిర్వహించినట్లు చెప్పారు. పరిశ్రమలలో ప్రమాదం జరిగినప్పుడు యాజమాన్యం తక్షణమే స్పందించాలని, అగ్నిమాపక, నీటి సరఫరా,వైద్య ఆరోగ్య శాఖల బృందాలు నిర్దేశిత సమయంలో అప్రమత్తమై పరస్పర సహకారంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఇలాంటి నమూనా విన్యాసాల వల్ల అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వ్యవస్థలు బలోపేతమవుతాయని, ఉద్యోగులకు ఆత్మరక్షణ పద్ధతులు తెలుస్తాయని పేర్కొన్నారు. ప్రమాద సమయాల్లో మరణాల సంఖ్యను పూర్తిగా తగ్గించడంతో పాటు, గాయపడిన వారికి తక్షణ వైద్యం అందించేందుకు,విపత్తు వేళల్లో ప్రభుత్వ యంత్రాంగం ఎంతవరకు సిద్ధంగా ఉందో తెలుసుకునేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. హైదరాబాద్ నుండి కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం అధికారులు ఈ నమూనా విన్యాస కార్యక్రమాన్ని అంతర్జాలం (ఆన్‌లైన్) ద్వారా ప్రత్యక్షంగా వీక్షించి, పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జీ రమేష్,పరిశ్రమల తనిఖీ అధికారి శ్రీదేవి,పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సతీష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, పిసిబి జిల్లా అధికారి వెంకన్న,తహసిల్దార్ ఎం విజయ్ కుమార్, ఎంపీడీవో ఎస్పీ జయలక్ష్మి, అడిషనల్ ఆర్ ఐ అమర్నాథ్ రెడ్డి, పిట్టంపల్లి బొంగుని చెరువు సర్పంచులు అందే అండాలు రాములు, కట్ట ఆశయ, ఉప సర్పంచ్ కామెడీ సాయి కృష్ణారెడ్డి, సెక్రటరీ మల్లేష్,ప్లాంట్ ఇంచార్జ్ రాజేంద్ర కుమార్,ఈహెచ్ఎస్ ఇంచార్జీ శ్యాంసన్,ఈహెచ్ఎస్ క్లస్టర్ ఇంచార్జ్ నరేందర్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారితో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తులపై అప్రమత్తత

– వరంగల్‌లో ఉత్కంఠ రేపిన రెడ్ అలెర్ట్ మాక్ డ్రిల్

– చెరువులో చిక్కుకున్న వారిని క్షణాల్లో రక్షించిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

– సహాయక చర్యలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద





**వరంగల్, 18 మే (సాక్ష్యం)** వరంగల్ నగరంలో సోమవారం నిర్వహించిన ప్రకృతి విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ ప్రజల్లో ఉత్కంఠ రేపింది. నిజంగా వరద విపత్తు సంభవించినట్టే అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేపట్టిన సహాయక చర్యలు కళ్లకు కట్టినట్లు కనిపించాయి. మధ్య కోట గుండు చెరువు ప్రాంతంలోని యాదవవాడలో రెడ్ అలెర్ట్ ప్రకటించడంతో ఒక్కసారిగా అప్రమత్తమైన అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. ఈ ప్రక్రియవంత ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 వరకు జరిగింది. ఈ కార్యక్రమం వలన ప్రజలలో మంచి అవగాహన కలిగించుటకు ఈ మాక్ డ్రిల్ ఎంతగానో ఉపయోగపడిందని ప్రజలకు బరోసా కల్పించడం జరిగింది. ఈ మాక్ డ్రిల్‌లో వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో చేపట్టిన ఈ మాక్ డ్రిల్‌లో పోలీస్, రెవెన్యూ, ఫైర్, వైద్య ఆరోగ్య, పశు సంవర్ధక శాఖలతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేశాయి. ప్రమాద సమయంలో క్షణం ఆలస్యం కూడా ప్రాణనష్టానికి దారితీస్తుందనే పరిస్థితిని ప్రత్యక్షంగా ప్రజలకు చూపించడంలో ప్రజల్లో అవేర్నెస్ కల్పించడం జరిగింది. వరంగల్ ఏకశిలా పార్కు చెరువులో ఇద్దరు వ్యక్తులు నీటిలో కొట్టుకుపోతుండగా, మరో ఇద్దరు చెరువు మధ్యలోని బండరాళ్లపై ప్రాణభయంతో సహాయం కోసం అరుస్తున్న దృశ్యాలు అక్కడ ఉన్న వారిని కలచివేశాయి. సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు హుటాహుటిన బోట్లతో చెరువులోకి దూసుకెళ్లి, ఉధృత నీటిని చీల్చుకుంటూ బాధితులను రక్షించాయి. ఈ దృశ్యాలు చూస్తున్న ప్రజలు కాసేపు ఇది మాక్ డ్రిల్ అన్న విషయాన్నే మరిచిపోయారు. అదే సమయంలో వరద ప్రవాహంలో కొట్టుకుపోతున్న గొర్రెలు, ఆవులను కూడా ప్రత్యేక బృందాలు సాహసోపేతంగా రక్షించుటలో ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాల తీరు ను ప్రజలు అభినందించారు. నీటిలో నుంచి బయటకు తీసిన పశువులను వెంటనే పశువైద్య సిబ్బంది చికిత్స కోసం తరలించారు. రక్షించిన బాధితుల్లో ఒకరు అపస్మారక స్థితిలో ఉన్నట్లు చూపించగా, వైద్య సిబ్బంది అక్కడికక్కడే సీపీఆర్ నిర్వహించి ప్రాణాలు కాపాడే విధానాన్ని ప్రదర్శించారు. అనంతరం 108 అంబులెన్స్‌లో బాధితుడిని ఎంజీఎం ఆసుపత్రికి తరలించడం ద్వారా అత్యవసర వైద్య సేవల స్పందనను చూపించారు. ప్రమాదం సంభవించినప్పుడు శాఖల మధ్య సమన్వయం, ప్రజల తరలింపు, సహాయక చర్యలు ఎలా ఉండాలనే అంశాలను ఈ మాక్ డ్రిల్ ద్వారా స్పష్టంగా ప్రజలు గమనించారు. వరద బాధితులకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి భోజన ప్యాకెట్లు తాగునీటిని అందించారు. కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, విపత్తుల సమయంలో ప్రతి నిమిషం కీలకమని, అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మాక్ డ్రిల్ స్థానిక ప్రజలు, విద్యార్థులు, అధికారులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రత్యక్ష విపత్తు జరిగినట్టే కనిపించిన ఈ విన్యాసాలు ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలనే విషయంపై స్పష్టత కల్పించాయి. అడెల్లి బుచ్చయ్య ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి వారి మౌలిక సదుపాయాలు ఆరోగ్య క్యాంప్ లు ఏర్పాటు చేసిన తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వరంగల్ ఆర్డీవో సుమ, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఎంహెచ్‌వో సాంబశివరావుతో, అగ్నిమాపక అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు లతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కందగట్ల సత్యనారాయణ



**హనుమకొండ 18 మే (సాక్ష్యం)** భారతీయ జనతా పార్టీ బీజేపీ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కాజీపేటకు చెందిన బిజెపి నాయకుడు కందగట్ల సత్యనారాయణ ను నియమించారు.



**సమాజ సేవే లక్ష్యంగా పార్టీ బలోపేతమే ధ్యేయంగా**

ఓబీసీ వర్గాల అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతున్న కందగట్ల సత్యనారాయణ ను బిజెపి అధిష్ఠానం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించిన సందర్భంగా పలువురు పార్టీ శ్రేణులు, పద్మశాలి సంఘం బాద్యులు ఆయనను కలిసి అభినందనలు తెలిపి తమ నాయకత్వంలో ఓబిసి వర్గాల అభ్యున్నతికి మరింత స్ఫూర్తిదాయకంగా పాటుపడాలని కోరారు.

## రెడ్లకుంటలో తడి, పొడి చెత్తపై అవగాహన





**కోదాడ మే 18, (సాక్ష్యం)** కోదాడ మండలంలోని రెడ్లకుంట గ్రామపంచాయతీ ఆఫీసులో తడి, పొడి చెత్తపై పాలవకవర్గానికి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సర్పంచ్ పోలంపల్లి కుటుంబరావు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలను తడి, పొడి చెత్త వేర్వేరుగా గ్రామపంచాయతీ సిబ్బందికి అందించేలా వార్డు సభ్యులు ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా చెత్త బుట్టల్లో ఉంచి గ్రామపంచాయతీ సిబ్బందికి అందజేసి గ్రామం పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ మల్లెల ప్రసాద్, కార్యదర్శి నాగలక్ష్మి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు వరం

– చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్



**చౌటుప్పల్ మే 18 (సాక్ష్యం)** షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలు నిరుపేదల ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఎంతో ఆశగా వరాలుగా ఉపయోగపడుతున్నాయని చౌటుప్పల్ మున్సిపల్ చైర్పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని జయశ్రీ ఫంక్షన్ హాల్ లో చౌటుప్పల్ మున్సిపాలిటీలోని లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మోగదాల పావని రమేష్ గౌడ్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు వరం అని అన్నారు.అన్ని రంగాల్లో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన పేదల అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, అధిక సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

### భూపాలపల్లి ఏరియా కేటీకే ఓసి 2

# ఉపరితల గనిలో మల్టీ డిపార్ట్ మెంట్ సమావేశం

హాజరైన ఎస్ఓటు జిఎం కవీంద్ర



**(సాక్ష్యం) న్యూస్ జయశంకర్ – భూపాలపల్లి, మే 18 :** భూపాలపల్లి ఏరియా కేటీకే ఓసి 2 ఉపరితల గనిలో మల్టీ డిపార్ట్ మెంట్ సమావేశం భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో కేటీకే ఓసి 2 ఉపరితల గనిలో మల్టీ డిపార్ట్ మెంటల్ కార్యక్రమ సమావేశం నిర్వహించారు. సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 18వ తేదీ నుండి సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాల కార్యక్రమంలో భాగంగా సోమవారం జరిగిన ఈ సమావేశానికి ఏరియా ఎస్.ఓ. టు జి.ఎం కవీంద్ర ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ దేశ పారిశ్రామికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నదని, సంస్థ మరింత పురోగతి సాధించాలంటే ప్రతి ఉద్యోగి తన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. ఉద్యోగుల సమిష్టి కృషి, క్రమశిక్షణ, సమయపాలన అంకితభావమే సంస్థ విజయానికి మూలస్తంభాలని పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, పని గంటలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థ అభివృద్ధి ప్రతి ఉద్యోగి వ్యక్తిగత అభివృద్ధితో ముడిపడి ఉందని పేర్కొన్నారు, ఉద్యోగులందరూ సంస్థ లక్ష్యాలను తమ లక్ష్యాలుగా భావించి పనిచేయాలని కోరారు. నాణ్యత, ఉత్పత్తి ఉత్పాదకత పెంపు దిశగా సమిష్టి కృషి అవసరమని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ సంస్థను జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లాలని అన్నారు.

### ముదిరాజ్ కులస్తులను బీసీ (ఏ)లో

# చేర్చవద్దు అనే గంగపుత్రుల డిమాండ్‌ను ఖండిస్తున్నాం

– దేప శ్యాంసుందర్ ముదిరాజ్



**చౌటుప్పల్ మే 18 (సాక్ష్యం)** ముదిరాజ్ కులస్తులను బిసి (ఏ) లో చేర్చవద్దనే గంగపుత్ర సంఘం చేసిన ప్రకటనను ఖండిస్తున్నాం అని ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకులు దేప శ్యాం సుందర్ ముదిరాజ్ అన్నారు. సోమవారం పత్రిక ప్రకటన ద్వారా వారు తెలియజేస్తూ ముదిరాజుల ను బిసి (ఏ) లో చేర్చడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను చూసి ఓర్వలేక చేస్తున్న ఈ కుట్రలను తిప్పికొడతామని అన్నారు. మీకు కావలసిన హక్కులను మీరు అడగవచ్చు కానీ, మేము అడిగే హక్కులను హరించవద్దని, భవిష్యత్తులో ఇలాంటి ప్రకటనలు చేయవద్దని అన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన జనాభాలో ముదిరాజులే అత్యధికంగా ఉన్నారని తేటతెల్లమైందని , మేము కొత్తగా ఏమీ అడగడం లేదని , ప్రభుత్వం ఇచ్చిన మేనిఫెస్టోనే అమలు చేయాలని అంటున్నామని అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ముదిరాజ్ ఐక్య సంఘాలు కలిసి అడగగా,వారు ప్రభుత్వ యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసి, సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. బీసీ (ఏ) అమలుకు అడుగులు పడుతున్న ఈ తరుణంలో గంగపుత్రులు ఇలా సమావేశాలు, ప్రెస్ మీట్ లు పెట్టడం సరికాదని వారికి సూచించారు.ముదిరాజులు చేస్తున్న పోరాటంలో అన్ని ముదిరాజ్ సంఘాలు పాల్గొని ఐక్య ఉద్యమాలు చేసి ఇలాంటి ప్రకటనలను ఖండించాలని పత్రికా ప్రకటన ద్వారా వారు కోరారు.

### వడ్ల కొనుగోలు కేంద్రాన్ని

# ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ



**(సాక్ష్యం) న్యూస్ జయశంకర్ – భూపాలపల్లి, మే 18 :** భూపాలపల్లి మండలంలోని ఎస్.ఎం. కొత్తపల్లి గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. రైతులు తీసుకొచ్చే వరి ధాన్యాన్ని తేమ శాతం (మాయిశ్చర్) వచ్చిన వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని వరి ధాన్యం కొనుగోలు కేంద్ర ఇన్‌చార్జ్‌కు సూచించారు. అలాగే రైతులకు ఎలాంటి కోతలు లేకుండా అధికారులు పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని ఆదేశించారు.వానాకాలం ప్రారంభమయ్యే పరిస్థితులు ఉన్న నేపథ్యంలో రైతులకు అవసరమైన పరదాలను ప్యాక్స్ ద్వారా అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి, భూపాలపల్లి ప్యాక్స్ చైర్మన్, సీఈఓ, ముఖ్య నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ పర్వత వర్ధిని సమేత

# రామలింగేశ్వర స్వామి వారి ఉత్సవ సేవ



**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్.** యాదాద్రి అనుబంధ ఆలయం శివాలయంలో శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వరుని ఆలయంలో సోమవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు.. యాదాద్రి కొండ పై అనుబంధ దేవాలయం శివాలయంలో పర్వత వర్ధిని శ్రీ రామలింగేశ్వరుడు కి అర్చకులు రుద్రాభిషేకం, రుద్ర హోమం ప్రత్యేక పూజలు చేశారు, పార్వతీ దేవిని కొలుస్తూ శివాలయం ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలోని అర్చకులు కుంకుమార్చన జరిపారు. ఉదయం, శివునికి అభిషేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో, బిల్వ పత్రాలతో ,ప్రత్యేకంగా అలంకరించి, స్వామి వారిని ఆరాధించారు. వేద మంత్రోచ్చారణ చేత ప్రత్యేక మంగళ హారతులతో స్వామి వారిని కొలిచారు.స్వామి వారిని భక్తులకు దర్శింప చేశారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై వినూత్న నిరసన

– 27 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర – ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య





**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రజలపై పెరుగుతున్న ఇంధన భారం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు సోమవారం ఉదయం 6 గంటలకు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాదాల వద్ద నుంచి కొలనుపాక సోమేశ్వర ఆలయం వరకు సుమారు 27 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ సైకిల్ యాత్రలో భాగంగా యాదగిరిపల్లి, వంగపల్లి, రామాజీపేట, పెద్ద కందుకూరు, చిన్న కందుకూరు, బాహుపేట తదితర గ్రామాల మీదుగా ప్రయాణిస్తూ ఆలేరు మార్కెట్ యార్డు సహా మొత్తం తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి ధాన్యం కొనుగోలు పరిస్థితులు, రవాణా సమస్యలు, హమాలీల కొరత, లారీల అందుబాటు వంటి అంశాలపై ఆరా తీశారు. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలింపులో జాప్యం ఉన్నట్లు గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వెంటనే తొమ్మిది కొనుగోలు కేంద్రాలకు లారీలు సమకూర్చి ధాన్యం రవాణా ప్రక్రియను వేగవంతం చేశారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గారు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలులో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా పని చేయాలని సూచించారు. రైతుల సమస్యల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని అన్నారు. పెరుగుతున్న ఇంధన ధరల వల్ల రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీనికి నిరసనగా వచ్చే నెల రోజుల పాటు ఆలేరు నియోజకవర్గ పర్యటనల్లో అధికార వాహనం, ఎస్కార్ట్ వాహనాలను వినియోగించకుండా కేవలం ఎలక్ట్రిక్ స్కూటీల ద్వారానే ప్రజల మధ్య తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకుంటానని ఎమ్మెల్యే వెల్లడించారు.

### కాళేశ్వరంలో వరదలపై

# ఎన్‌డీఎంఏ ఆదేశాల మేరకు మాక్ డ్రిల్ నిర్వహణ



**(సాక్ష్యం) న్యూస్ జయశంకర్ – భూపాలపల్లి, మే 18 :** కాళేశ్వరంలో వరదలపై ఎన్‌డీఎంఏ ఆదేశాల మేరకు మాక్ డ్రిల్ నిర్వహణ భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాళేశ్వరంలో గోదావరి నదిపై వరదలు సంభవించిన సందర్భంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, సహాయక చర్యలపై ప్రజలకు సిబ్బందికి అవగాహన కల్పించే ఉద్దేశంతో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆదేశాల మేరకు మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగింది.ఈ మాక్ డ్రిల్‌ను ఎస్‌డీఆర్ఎఫ్, రెస్క్యూ బృందాలు, ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ పోలీస్ శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ , అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి పాల్గొని మాక్ డ్రిల్‌ను పరిశీలించారు. వరదల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించడం, గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం అందించడం, సమాచార వ్యవస్థలో సమన్వయం వంటి అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ మాట్లాడుతూ, వర్షాకాలంలో వరదల ప్రమాదం అధికంగా ఉండే ప్రాంతాల్లో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు కూడా అధికారుల సూచనలను పాటిస్తూ పోలీస్ రెస్క్యూ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా విపత్తు నిర్వహణలో శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగుపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీటు బెల్టు పెట్టుకోండి..ప్రాణాలను రక్షించుకోండి

– ట్రాఫిక్ సీఐ యలగొండ కృష్ణ



**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్** యాదగిరిగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం రోజు ప్రత్యేక డ్రైవ్ గా సీటు బెల్ట్ దాని ఉపయోగాలు వాహనదారులకు తెలియజేయడం జరిగింది. సీట్ బెల్ట్ పెట్టుకున్నట్లయితే ప్రమాదం జరిగినప్పుడు ఎయిర్ బ్యాగ్ ఓపెన్ అవుతుందని ఫలితంగా ప్రమాద తీవ్రత నుండి బయటపడవచ్చు అని యాదగిరిగుట్ట ట్రాఫిక్ సీఐ యలగొండ కృష్ణ వాహనదారులకు తెలియజేయడం జరిగింది. లక్షలు పెట్టి కార్లు కొన్న సీటు బెల్టు ఉపయోగించుకుంటే ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అదేవిధంగా వాహనంలో ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని తెలపడం జరిగింది. ఎవరైతే సీటు బెల్టు పెట్టుకోకుండా ప్రయాణిస్తున్నారో వారికి జరిమానా కూడా విధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ట్రాఫిక్ సిఐ యలగొండ కృష్ణ, దేవేందర్ ఎస్సై, సలీం, హనుమంతు, వెన్నెల, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

### ఈ నెల 18 నుంచి 23 వరకు

# పర్యాటక, క్రీడా యువజన వారోత్సవాలు

– పోస్టర్లు, బ్రోచర్లను ఆవిష్కరించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్, మే 18 ( సాక్ష్యం బ్యూరో ) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18 నుంచి 23 వరకు జిల్లాలో పర్యాటక వారోత్సవాలు, క్రీడా -- యువజన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా పర్యాటక మండలి చైర్‌పర్సన్ ఖుష్బూ గుప్తా తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్లో “టూరిజం వీక్”, “యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్” పోస్టర్లు, బ్రోచర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతలో శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతాభావం పెంపొందించడం, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరు రోజుల పాటు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో యువజన సంఘాలు, క్రీడాకారులు, విద్యార్థులు, వాలంటీర్లు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాలు కొనసాగనున్నాయని పేర్కొన్నారు. మే 18న “ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ” కార్యక్రమంతో వారోత్సవాలు ప్రారంభమయ్యాయని, జిల్లా స్థాయిలో 5 కిలోమీటర్ల మారథాన్, యోగా, ధ్యానం, ఏరోబిక్స్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మండల కేంద్రాల్లో 2 కిలోమీటర్ల వాక్‌థాన్‌లు, యోగా కార్యక్రమాలు కూడా నిర్వహించారని చెప్పారు. మే 19న “కెరీర్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ డే” సందర్భంగా నైపుణ్యాభివృద్ధి కోర్సులు, స్పోర్ట్స్ యూనివర్సిటీ అవకాశాలు, అగ్నివీర్ నియామకాలపై వర్చువల్ సెషన్లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మే 20న “యూత్ లీడర్‌షిప్ సమ్మిట్”లో యూత్ పార్లమెంట్, చిత్రలేఖన పోటీలు స్టేడియం గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 21న “ప్లే అండ్ పార్టిసిపేట్ -- స్పోర్ట్స్ డే”గా జిల్లా స్టేడియంలో అథ్లెటిక్స్, బాడ్మింటన్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మే 22న “సర్వ్ అండ్ సపోర్ట్ -- క్లీన్ తెలంగాణ” కార్యక్రమంలో భాగంగా క్రీడా మైదానాలు, పార్కులు, చెరువుల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మే 23న ఉద్యోగ సాధన కార్యక్రమంలో భాగంగా జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేయడంతో పాటు సీఎం కప్ -- 2025 విజేతలకు, క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. పర్యాటక వారోత్సవాల సందర్భంగా మే 19న కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ వద్ద టూరిజం అవేర్‌నెస్ డ్రైవ్, మే 20న పిల్లల మర్రి మ్యూజియం వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 21న యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్లతో సమావేశం, మే 22న స్వచ్ఛత డ్రైవ్, మే 23న టూరిజం బ్రాండ్ కిట్ పోస్టర్ విడుదల, టూరిజం క్విజ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని యువత, యువజన సంఘాలు, క్రీడా సంఘాలు, క్రీడాకారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి మరియు జిల్లా పర్యాటక అధికారి జె. రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామానుజుల రెడ్డి, డీపీఆర్వో పి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### నల్లబండగూడెంలో

# తడి, పొడి చెత్తపై అవగాహన



**కోదాడ మే 18, (సాక్ష్యం)** కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామపంచాయతీ ఆఫీసులో తడి, పొడి చెత్తపై పాలవకవర్గానికి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సర్పంచ్ అల్సకాని భవాని శరభేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలను తడి, పొడి చెత్త వేర్వేరుగా గ్రామపంచాయతీ సిబ్బందికి అందించేలా వార్డు సభ్యులు ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా చెత్త బుట్టల్లో ఉంచి గ్రామపంచాయతీ సిబ్బందికి అందజేసి గ్రామం పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ యరమాల శ్రీనివాస్, కార్యదర్శి జానీపాషా, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్‌పై

# ట్రాఫిక్ పోలీసుల కఠిన చర్యలు

ఒకరికి జైలు శిక్ష – ఏడుగురికి జరిమానా



**మహబూబ్‌నగర్, మే 18 (సాక్ష్యం బ్యూరో):** మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె. రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డుపై ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 8 మందిని ట్రాఫిక్ పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని సోమవారం సెకండ్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి ఆర్. శశిధర్ ఎదుట హాజరుపర్చగా, అందులో 7 మందికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా విధించారు. అదేవిధంగా ఒక ద్విచక్ర వాహనదారునికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికంగా ఉంటాయని, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ స్పందన

– బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు: జిల్లా ఎస్పీ జానకి



**మహబూబ్‌నగర్, మే 18 (సాక్ష్యం బ్యూరో):** ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ దరావత్ జానకి తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన 26 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు పోలీసు శాఖపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి పోలీసు అధికారికి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. బాధితులకు వేగవంతమైన సేవలు అందించేందుకు అధికారులు స్పందనాత్మకంగా పనిచేయాలని సూచించారు.

## వినికిడి లోపం ఉన్న చిన్నారులకు వినికిడి పరికరాల పంపిణీ

మహబూబ్‌నగర్, మే 18 ( సాక్ష్యం బ్యూరో ) : వినికిడి లోపం ఉన్న చిన్నారులు సమాజంలో ఇతర పిల్లలతో సమానంగా ఎదగడానికి ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారా



లను అందిస్తోందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. ఆర్‌బిఎస్‌కె, డిఈఐసి అధికారులు గుర్తించిన 7 మంది వినికిడి లోపం ఉన్న చిన్నారులకు (బధిరులకు) జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ తన ఛాంబర్లో వినికిడి పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ఇలాంటి పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. చిన్నారులు సాధారణ పిల్లల మాదిరిగానే అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం, జిల్లా వైద్య శాఖ అధికారి డా. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## టీజీ ఈఏపీ సెట్ ఫలితాలలో 2148 ర్యాంకు

### సాధించిన బుట్టి వెన్నెల కు ఘన సన్మానం

చౌటుప్పల్ మే 18 (సాక్ష్యం): చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామానికి చెందిన బుట్టి శ్రీనివాసులు



కుమార్తె బుట్టి వెన్నెల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ.. తెలంగాణ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ ఈఏపీ సెట్) ఫలితాలలో 2148 రాష్ట్ర ర్యాంక్ సాధించినందుకు గ్రామ ప్రజలు సోమవారం ఘనంగా సన్మానించారు. 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు గ్రామంలోని ప్రైమరీ స్కూల్లో చదివిన వెన్నెల, 6వ తరగతి నుండి పదవ తరగతి వరకు రామన్నపేట మండలం జనంపెల్లి లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించారు. ఇంటర్మీడియట్లో అసనపర్తి, వరంగల్ లో 990 మార్కులతో స్టేట్ ర్యాంకు పొంది,ఈఏపీ సెట్ ఫలితాలలో 2148 స్టేట్ ర్యాంకు సాధించడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలలో చదివి ర్యాంకు పొందినందుకుగాను వెన్నెలను ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సన్మానించి అభినందనలు తెలిపారు.

## గోదావరి నదిలో ఇసుక దొంగలకు చెక్

ఏటూరునాగారం, మే 18, (సాక్ష్యం) ; మండలంలోనిముల్లకట్ట గ్రామ పంచాయితీ పరిధిలోని గోదావరి నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని సమాచారం మేరకు



తహశీలార్ జగదీష్ సోమవారం తనిఖీలు చేపట్టారు. ముల్లకట్ట బ్రిడ్జి వద్ద గోదావరి నదిలోకి దిగే మార్గంలో ట్రాక్టర్లు ఇతర ఇసుక రవాణా వాహనాలు వెళ్లకుండా ఇసుక అక్రమ రవాణాలో అడ్డుకట్ట వేయుటకు ట్రంచ్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా అధికారులు చేపట్టిన ట్రంచ్ ను తొలగించి అక్రమ ఇసుక రవాణా చేయుటకు ఎవరైనా ప్రయత్నించిన యెడల వారి వాహనాలను సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులను నమోదు చేయడం జరుగుతుందని తహశీల్దార్ జగదీష్ హెచ్చరించారు. ఈ ట్రంచ్ ఏర్పాటులో ఆర్ ఐ కిరణ్ కుమార్, మండల గిర్దవార్ టీ వెంకట నర్సమ్మ, జీపీవోలు పాల్గొన్నారు.

## అమృత్ పథకంతో ఇంటింటికీ మంచినీరు

### రెండేళ్లలో అన్ని ఇళ్లకు తాగునీటి వసతి

### పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి

నెల్లూరు,మే18: రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నదీజలాలను అందిస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. రాష్ట్రంలో రూ.14 వేల కోట్లతో అమృత్ పథకం కింద పనులు జరుగుతున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. నెల్లూరులోని 54వ డివిజన్‌లో 350 కిలోలీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న మంచినీటి ట్యాంకు పనులకు నారాయణ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గందరగోళం చేసి వెళ్లారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా.. కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో రాజీపడట్లేదు. సీఎం చంద్రబాబు ప్రజారంజక పాలన అందిస్తున్నారు. ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యం. పీ4 ద్వారా పేదలకు చేయూతనిచ్చేందుకు నా వంతు కృషి చేస్తున్నా. పేదరిక నిర్మూలన.. విద్యాభివృద్ధితోనే సాధ్యం అని నారాయణ తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని అన్నారు. ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించడంతో పాటు, పేదలకు పథకాలను అందచేస్తున్నామని అన్నారు. ఇకపోతే అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు.

# ఆదర్శ గ్రామ నిర్మాణ పై గ్రామ సభ: సర్పంచ్ నిర్మల

ఏటూరునాగారం, మే 18, (సాక్ష్యం) : ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం




గాంధీనగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ బానోతు నిర్మల వెంకన్న ఆధ్వర్యంలో సోమవారం గ్రామ ప్రజలతో ఆదర్శ గ్రామ నిర్మాణం పై అవగాహన కల్పిస్తూ గ్రామ సభను నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాలవికాస ఆదర్శ గ్రామం పథకం సీనియర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వసంత మాట్లాడుతూ ఆదర్శ గ్రామం అంటే రోడ్డు భవనాలు నిర్మించుకోవడం కాదు వినూత్న కార్యక్రమాలను చేపడుతూ క్రమశిక్షణతో గ్రామ ప్రజలందరూ కట్టు బాట్లు నియమాలు పద్ధతులు పెట్టుకుని వాటిని పాటిస్తూ ఊరంత కలిసి ఒకే మాట ఒకే బాటలో ఐక్యముతో ఉంటే ఆదర్శ గ్రామం సాధించుకోవచ్చని, ఈ సందర్భంగా ఎనిమిది కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం గ్రామ సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న మాట్లాడుతూ మా గ్రామంలో పాల వికాసం సంస్థ ద్వారా నిర్వహించే ప్రతి కార్యక్రమానికి గ్రామపంచాయతీ



నుండి పూర్తి సహకారం అందిస్తాము బాలవికాస ఆదర్శ గ్రామ నిర్మాణ పథకంలో మా గ్రామం ఎన్నుకున్నందుకు మాకు చాలా సంతోషంగా ఉంటుందన్నారు. అదేవిధంగా గ్రామంలో ఒక పండగ వాతావరణం ఉందన్నారు. గ్రామ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛందంగా గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం తీసుకోవడానికి ముందుకొచ్చిన కమిటీ వాళ్లకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. అందరం కలిసి మన గ్రామాన్ని మార్చుకున్నామని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, గ్రామ ఉపసర్పంచ్ వల్లపు మహేష్, పంచాయతీ కార్యదర్శి రఘు, వార్డు సభ్యులు, మాలోత్ శంకర్, కూరాకుల సురేష్, రామావత్ సంధ్య, తేజావత్ హుని, లిక్కి కుమారస్వామి, లాకావత్ ఈరయ, బాలవికాస ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజ్ కుమార్ , డెవలప్మెంట్ ఏజెంట్లు , కే వినయ్ కుమార్, శంకర్ గ్రామం పెద్దలు గ్రామ ప్రజలు యువకులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగను సామరస్య వాతావరణంలో నిర్వహించాలి

హనుమకొండ 18 మే (సాక్ష్యం): త్వరలో జరిగే బక్రీద్ పండుగను శాంతియుతంగా, పరస్పర గౌరవ భావాలతో నిర్వహించేందుకు సహకరించాలని వరంగల్ సిటీ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. సోమవారం హనుమకొండ



కలెక్టరేట్ ఐడీఓసీలో హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి అధికారులు, పీస్ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ సందర్భంగా చేపట్టాల్సిన శాంతిభద్రతల చర్యలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ, ఈద్గాల వద్ద సౌకర్యాల ఏర్పాటుపై వారు సమీక్ష నిర్వహించారు. మసీదులు, ప్రార్థనా స్థలాలు, ఈద్గాల పరిసరాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ వరంగల్, హనుమకొండ నగరాల్లో ప్రతి పండుగను ప్రజలు సామరస్యంతో జరుపుకుంటారని, అదే స్ఫూర్తితో బక్రీద్ పండుగను కూడా ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. ప్రతి మతానికి సంబంధించిన భావోద్వేగాలను గౌరవించడం పోలీసు శాఖ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా పరస్పర సహకారంతో పండుగను నిర్వహించాలని కోరారు. జంతువులకు పశుసంవర్ధక శాఖ ద్వారా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. పశువుల వ్యర్థాలను రోడ్లపై వేయకుండా పరిశుభ్రత పాటించాలని, మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ప్రజలను కోరారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, మత విద్వేషాలను రెచ్చగొట్టే సందేశాలు ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు కమిషనర్ హెచ్చరించారు. ప్రజలు బాధ్యతాయు



తంగా వ్యవహరించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ఆయన కోరారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ద్వారా బలికి ఉపయోగించే పశువులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు త్వరితగతిన జారీ చేయాలని సూచించారు. ఎవరైనా మనోభావాలు దెబ్బతీనకుండా పరస్పర గౌరవంతో పండుగను జరుపుకోవాలని కోరారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు, పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ అఫ్జల్ బియాబాని ఖుస్రో పాషా, డీసీపీలు అంకిత్ కుమార్, ధారా కవిత, రాజమహేంద్ర నాయక్ అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు, ఏసీపీలు, ఆర్డీవోలు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, శాంతి కమిటీ అధ్యక్షులు డాక్టర్ అనిస్ సిద్ధిక్వి, సభ్యులు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి జాతరలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

మాడుగులపల్లి మే 18 సాక్ష్యం; మాడుగులపల్లి మండలంలోని గజాలపురం గ్రామంలో సోమవారం నిర్వహిస్తున్న గంగమ్మ తల్లి జాతరలో గ్రామస్తుల పార్టీ నాయకుల ఆహ్వాన మేరకు జాతరలో నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ పెద్దదేవులపల్లి సర్పంచ్ గుండెబోయిన



వెంకటేశ్వర్ తో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోలగాని కృష్ణయ్య,గ్రామ శాఖ అధ్యక్షులు ఎల్లబోయిన శేఖర్,పొలగాని నరేష్,మురళీ, కొటేష్, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఐఐసీటీ ఉద్యోగ పరీక్షలో హైటెక్ మాల్‌ప్రాక్టీస్ రాకెట్ బట్టబయలు.. 12 మంది అరెస్ట్

నాచారం, మే 18 (సాక్ష్యం): మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన సిఎస్ఐఆర్–ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ ఉద్యోగ నియామక పరీక్షలో సంఘటిత మాల్‌ప్రాక్టీస్ రాకెట్‌ను నాచారం పోలీసులు ఛేదించారు. అత్యాధునిక రహస్య ఎలక్ట్రానిక్ పరికరాల సహాయంతో పరీక్షలో




అక్రమాలకు పాల్పడుతున్న 12 మంది అభ్యర్థులను పోలీసులు అరెస్ట్ చేసి భారీగా ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మే 17న స్నేహపురి కాలనీలోని సెయింట్ పాయిస్ ఎక్స్ డిగ్రీ, పీజీ అండ్ ఎంబీఏ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్) పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షలో కొంతమంది అభ్యర్థులు అనుమానాస్పదంగా ప్రవర్తించడం గుర్తించారు. వెంటనే నాచారం పోలీస్ స్టేషన్ సిబ్బంది, సిఎస్ఐఆర్–ఐఐసీటీ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. మొదట మందీప్ అనే అభ్యర్థి వద్ద రహస్య ఎలక్ట్రానిక్ పరికరాలు బయటపడగా, అనంతర విచారణలో మొత్తం 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన వారి నుంచి మైక్రో, నానో ఇయర్‌ఫోన్లు, స్పై జీఎస్ఎం కమ్యూనికేషన్ పరికరాలు, మార్పు చేసిన మొబైల్ ఫోన్లు, సిమ్ ఆధారిత రహస్య కమ్యూనికేషన్ పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో అరెస్టు అయిన వారిలో పలువురు హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులుగా గుర్తించారు. వీరు హర్యానాలోని “మైండ్ క్యూ టైపింగ్” సంస్థ ద్వారా శిక్షణ పొందినట్లు, బయట ఉన్న హ్యాండ్లర్ల సహాయంతో ప్రశ్నాపత్రాలను స్కాన్ చేసి సమాధానాలు అందుకుంటూ పరీక్షలో మోసానికి పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో అభ్యర్థుల నుంచి రూ.1 లక్ష నుంచి రూ.8 లక్షల వరకు వసూలు చేసిన ఆర్థిక లావాదేవీల అంశాలు కూడా వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.పోలీసుల విచారణలో అభ్యర్థులు చెవుల్లో మైక్రో స్పై ఇయర్‌ఫోన్లు దాచుకోవడం, శరీరానికి రహస్య కమ్యూని



కేషన్ పరికరాలను అమర్చుకోవడం ద్వారా పరీక్షలు రాసినట్లు గుర్తించారు. కొందరు అభ్యర్థులు ప్రశ్నాపత్రాలను మార్పు చేసిన మొబైల్ పరికరాల ద్వారా బయట ఉన్న హ్యాండ్లర్లకు పంపగా, అక్కడి నుంచి సమాధానాలు తిరిగి పంపించి వాటిని వినిపించే విధానాన్ని అనుసరించినట్లు వెల్లడైంది. ఈ ఘటనపై నాచారం పోలీసులు కేసు నంబర్ 242/2026గా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తెలంగాణ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహిత (BNS)లోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పరారీలో ఉన్న మిగతా నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని, కేసు మల్కాజ్‌గిరి కమిషనరేట్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రతి వ్యక్తికి వ్యాయామం అవసరం

మాడుగులపల్లి మే 18 సాక్ష్యం; ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యూత్ & స్పోర్ట్స్ స్పోర్ట్స్ వీక్స్ లో భాగంగా ఫిట్ అండ్ ఆక్టివ్ తెలంగాణ ర్యాలీ మరియు శారీరక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా సోమవారం మాడుగులపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి జి.వంశీధర్ ఆధ్వర్యంలో టోలేట్ నుండి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వరకు రన్ చేయడం జరిగింది. గ్రామపంచాయతీ కార్యాలయంలో యోగా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ



కార్యక్రమంలో మాడుగులపల్లి ఎస్సై ఎస్ కృష్ణయ్య, ఎంపీఓ సంగీత,సర్పంచ్ ఆరూరి నరేష్, ఆర్ఐ సత్యనారాయణ,రెవెన్యూ సిబ్బంది,ఐసి డిఎస్ సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది ఈజీఎస్ సిబ్బంది,గ్రామ పంచాయతీ సిబ్బంది, యువత తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులు

### మూడు పోర్టుల పనులు ఏడాది చివరికి పూర్తి.. అధికారులతో సమీక్షలో మంత్రి జనార్ధన్ రెడ్డి

అమరావతి,మే18: గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల పనులు వేగవంతం చేయాలని ఏపీ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను



ఆదేశించారు. రాష్ట్రంలోని మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేసి.. అందుబాటులోకి తీసుకురావాలని దిశానిర్దేశర చేశారు. గ్రీన్‌ఫీల్డ్ పోర్టు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తుందని తెలిపారు.పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంలో సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, పిషింగ్ హార్బర్ల పురోగతిపై మంత్రి సోమవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణంలో ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే, పరిష్కరిస్తామని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ క్రమంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌ల పనులు మరింత వేగవంతం చేసి, సకాలంలో పూర్తి చేయాలని మార్గనిర్దేశర చేశారు. మూలపేట పోర్టుకు సంబంధించి ప్రధానంగా ఉప్పు భూముల సమస్య, రోడ్డు, రైల్వే, ఆర్ అండ్ ఆర్ వంటి మౌలిక సదుపాయాల కల్పన సమస్యలు పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని సూచించారు.
మూలపేట గ్రామానికి పునరావాస కల్పనను వేగవంతం చేయడం ద్వారా డ్రెడ్జింగ్‌ను సకాలంలో పూర్తి చేయడంతో పాటు, ఈ ఏడాది ఆఖరు నాటికి పోర్టు నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సంబంధించి బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్ పనులు మరింత వేగవంతం చేయాలని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. మచిలీపట్నం పోర్టుకు రైల్వే అనుసంధానం, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలని దిశానిర్దేశర చేశారు. కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను చేపట్టిన క్రమంలో వాటిని సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు సహకరించాలని కోరారు. రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టులో డ్రెడ్జింగ్, పునరావాసం వంటి సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని మార్గనిర్దేశర చేశారు. మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులతో పాటు, ఫేజ్1 ఫిషింగ్ హార్బర్‌ల పనులు కూడా సకాలంలో పూర్తి చేయాలని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు.



# ప్లే ఆఫ్స్‌కు సన్‌రైజర్స్

## చెన్నై సూపర్ కింగ్స్ తో ఉత్కంఠగా సాగిన మ్యాచ్

## సన్‌రైజర్స్ హైదరాబాద్ 5 వికెట్ల తేడాతో గెలుపు

## ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకున్న ఆరెంజ్ ఆర్మీ

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. సోమవారం చెన్నై వేదికగా చెన్నై సూపర్ కింగ్స్ తో ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో ఆరెంజ్ ఆర్మీ ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకోవడంతో పాటు గుజరాత్ టైటాన్స్ బెర్త్ కూడా ఖాయమైంది. సీఎస్‌కే అవకాశాలు మాత్రం సంక్లిష్టంగా మారాయి. అద్భుతం జరిగితే తప్పా ఆ జట్టు టోర్నీలో ముందడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. ఆ జట్టు తమ చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిచినా ప్లే ఆఫ్స్ చేరే అవకాశం లేదు. ఇతర జట్ల ఫలితాలు కలిసొస్తే తప్పా టోర్నీలో ముందడుగు వేయలేదు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్ కింగ్స్ 7 వికెట్లకు 180 పరుగులు చేసింది. డెవాల్డ్ బ్రెవిస్(27 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 44), కార్తీక్ శర్మ(19 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 32) టాప్ స్కోరర్లుగా నిలిచారు. సన్‌రైజర్స్ బౌలర్లలో పాట్ కమిన్స్ మూడు వికెట్లు తీయగా.. సాకిబ్ హుస్సేన్ రెండు వికెట్లు పడగొట్టాడు. ప్రఫుల్ హింగే, ఇషాన్ మలింగలకు చెరో వికెట్ దక్కింది. అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్ 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 181 పరుగులు చేసి గెలుపొందింది. ఇషాన్ కిషన్(47 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 70) హాఫ్ సెంచరీతో రాణించగా.. హెన్రీచ్ క్లాసెన్ (26 బంతుల్లో 6 ఫోర్లతో47) తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. సీఎస్‌కే బౌలర్లలో ముఖేష్ చౌదరి రెండు వికెట్లు తీయగా.. అకీల్ హోసేన్, నూర్ అహ్మద్, అన్షుల్ కాంబోజ్ తలో వికెట్ తీసారు. 181 పరుగుల లక్ష్య ఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓపెనర్ ట్రావిస్ హెడ్(6) మరోసారి నిరాశపర్చగా.. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ ఆచితూచి ఆడారు. దాంతో పవర్ ప్లేలో సన్‌రైజర్స్ హైదరాబాద్ వికెట్ నష్టానికి 45 పరుగులే చేసింది. తన శైలికి భిన్నంగా ఆడలేకపోయిన అభిషేక్ శర్మ(26)ను అకీల్ హోసెన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన హెన్రీచ్ క్లాసెన్‌తో కలిసి ఇషాన్ కిషన్ చెలరేగాడు. ఈ ఇద్దరూ సీఎస్‌కే బౌలర్లపై విరుచుకుపడటంతో సన్‌రైజర్స్ స్కోర్ బోర్డు పరుగెత్తింది. హాఫ్ సెంచరీకి చేరువైన హెన్రీచ్ క్లాసెన్(47)ను నూర్ అహ్మద్ స్టంపౌట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 75 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి నితీష్ కుమార్ రెడ్డి రాగా.. ఇషాన్ కిషన్ 37 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. భారీ షాట్ ఆడే ప్రయత్నంలో నితీష్ రెడ్డి(11) ఔటైనా.. సలీల్ అరోరా(10 నాటౌట్)తో కలిసి ఇషాన్ కిషన్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. విజయం ముంగిట ఇషాన్ ఔటైనా.. సలిల్ అరోరా, రవిచంద్రన్ స్మరణ్(5 నాటౌట్) విజయలాంఛనాన్ని పూర్తి చేశారు.



## ధోని ఫ్యాన్స్‌కు మరోసారి నిరాశ

ఐపీఎల్ 2026లో భాగంగా నేడు మరో హై వోల్టేట్ మ్యాచ్ జరుగుతోంది. చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో సీఎస్కే తలపడుతోంది. ఇక టాస్ గెలిచిన చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే సీఎస్కే అభిమానులకు ఈసారి కూడా నిరాశే మిగిలింది. ఎంఎస్ ధోనీ ఈ మ్యాచ్‌లో ఆడటం లేదని కెప్టెన్ రుతురాజ్ స్పష్టం చేశాడు. ధోనీ పూర్తి ఫిట్‌నెస్‌తో లేకపోవడం వల్లే ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడని రుతురాజ్ తెలిపాడు. ఈ రోజు తాము గెలుస్తామని, తదుపరి మ్యాచ్‌కు ధోనీ కోలుకుని తిరిగి జట్టులోకి వస్తాడని ఆశిస్తున్నట్లు కెప్టెన్ పేర్కొన్నాడు. ఈ క్రమంలో ధోనీ టీ20 రిటైర్మెంట్‌కు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. అయితే చెన్నై చేపాక్ వేదికగా జరగనున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో బరిలోకి దిగి సొంత అభిమానుల ముందు ధోనీ ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ఇచ్చేస్తాడని జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ధోనీ మాట్లాడిన వీడియో ఒకటి బయటకు వచ్చింది. అందులో ధోనీ 'చెన్నైలోనే నా ఆఖరి టీ20 మ్యాచ్ ఉంటుంది' అని అన్నాడు. దీంతో అది నిజం కానుందని అంటున్నారు. 'పక్కా ప్లానింగ్‌తోనే నా క్రికెట్ కెరీర్‌ను ఉంటుంది. ఇంటర్నేషనల్ లెవెల్‌లో నా చివరి మ్యాచ్ రాంచీలో ఆడాను. అలాగే ఆఖరి టీ20 మ్యాచ్‌ను చెన్నైలోనే ఆడతాను కావొచ్చు. అది ఇప్పుడేనా లేదా ఐదేళ్ల తర్వాతనా? అనేది చెప్పలేను!'అని ధోనీ 2021లో సీఎస్కే ఫ్రాంచైజీ నిర్వహించిన ఈవెంట్‌లో అన్నాడు. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతుంది.ఇదిలా ఉండగా, ధోనీకి సంబంధించిన ఒక కొత్త వీడియో సైతం నెట్టింట వైరల్‌గా మారింది. అందులో ధోనీ ఎన్‌ఎస్‌జీ కమాండర్స్‌తో మాట్లాడుతున్నట్లు కనిపిస్తుంది. ఫుడ్ ప్లేట్ చేతిలో పట్టుకొని ఉన్న ధోనీ అందులో 'నేను ఫిట్‌గా కనిపిస్తున్నానా?' అని ఎన్ఎస్‌జీ కమాండర్‌ను నవ్వుతూ అడుగుతాడు. దీంతో తాను ఫిట్‌గానే ఉన్నానని ఇలా ఫ్యాన్స్‌కు చెప్పాడని, రిటైర్మెంట్‌లాంటివి ఏమీ లేవని హింట్ ఇచ్చాడంటూ ఫ్యాన్స్ వాదిస్తున్నారు. అయితే సన్‌రైజర్స్‌తో సోమవారం చెన్నై వేదికగానే మ్యాచ్ ఉంది. ఈ సీజన్‌లో సీఎస్కేకు ఇదే హోం గ్రౌండ్‌లో లాస్ట్ మ్యాచ్. దీంతో ధోనీ గతంలో చెప్పిన రిటైర్మెంట్ టైమ్ ఇప్పుడే వచ్చేసిందా? అంటే నెటిజన్లు ఔను అనే అంటున్నారు. ప్రస్తుతం 44ఏళ్లు ఉన్న ధోనీ వచ్చే సీజన్‌దాకా ఫిట్‌నెస్ కాపాడుకోగలడా? అనేది కచ్చితంగా చెప్పలేం. ఇక ఇంటర్నేషనల్ క్రికెట్ నుంచి కూడా సడెన్‌గా వీడ్కోలు చెప్పి అందర్నీ షాక్‌కు గురి చేసిన తలా ఇప్పుడు ఐపీఎల్ నుంచి కూడా తప్పుకొని మరోసారి అభిమానులకు షాక్ ఇస్తాడా? అనేది వేచి చూడాలి!

## రవీంద్ర జడేజా ఆడకపోవడంపై విమర్శలు

ఐపీఎల్ ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌కు రాజస్థాన్ రాయల్స్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఆడకపోవడం ఇప్పుడు అనేక ప్రశ్నలు, అనుమానాలకు తావిచ్చింది. హాట్ డిబేట్ కు తెర తీసింది. ప్లేఆఫ్స్ చేరాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్‌కు డుమ్మా కొట్టడం పట్ల విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. మేనేజ్మెంట్ వ్యూహాత్మకంగా అతన్ని తప్పించిందా అనే సందేహాలు వ్యక్తమౌతున్నాయి. రవీంద్ర జడేజా ఆడకపోవడం పట్ల ఇంగ్లాండ్ మాజీ కేప్టెన్ మైఖెల్ వాన్ ఈ అనుమానాలు లేవనెత్తారు. అతను ఎందుకు దూరమయ్యాడని ప్రశ్నించారు. వర్క్ లోడ్ మేనేజ్మెంట్ కారణంగా రవీంద్ర జడేజా విశ్రాంతి తీసుకుంటున్నాడని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ చెప్పినప్పటికీ, దీనికి వేరే కారణం ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. వర్క్ లోడ్ మేనేజ్మెంట్ అనేది సమస్యే కాదని తేల్చి చెప్పారు. రవీంద్ర జడేజాకు ఏం జరిగిందో తెలుసుకోవాలని ఆసక్తిగా ఉంది. చిన్నపాటి సమస్యకు అతను మ్యాచ్ నుంచి తప్పుకోడు. విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా పనిభార నిర్వహణ పేరు చెప్పడం వింత. అతనికి ఏదో సమస్య ఉందనేది స్పష్టం. అతను మ్యాచ్



ఆడాలని కోరుకుంటున్నా..” అని పేర్కొన్నారు. బ్యాటింగ్ పతనం కాకుండా జడేజా అడ్డుకునేవాడని, మిచెల్ స్టార్క్‌పై భారీ షాట్లతో ఎదురుదాడికి దిగేవాడని తేల్చి చెప్పారు. ఎడమచేతి స్పిన్ బౌలర్ కావడం వల్ల పరుగులను కూడా కట్టడి చేసేవాడని వివరించారు. రియాన్ పరాగ్ కెప్టెన్సీని కూడా మైఖేల్ వాన్ తప్పుబట్టారు. ఢిల్లీ ఛేజింగ్‌లో 18వ ఓవర్‌లో పార్ట్‌టైమ్ స్పిన్నర్ డొనోవన్ ఫెరీరాను బౌలింగ్‌కు దించడాన్ని వాన్ విమర్శించారు. “డొనోవన్ ఫెరీరాను బౌలింగ్ చేయించిన వ్యూహాత్మక నిర్ణయాన్ని నేను ప్రశ్నించాల్సిందే. ఇద్దరు ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉన్నారని భావించి పార్ట్‌టైమ్ ఆఫ్-స్పిన్నర్‌ను ప్రవేశపెట్టారా? అది గొప్ప నిర్ణయం కాదు, అనవసరం.. అని వాన్ అన్నారు.

## కోల్‌కతా మేనేజ్‌మెంట్‌పై బీసీసీఐ సీరియస్!

ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్ కీలక ఘట్టానికి చేరుకుంటున్న వేళ కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు మేనేజ్‌మెంట్‌ను ఒక సరికొత్త వివాదం చుట్టుముట్టింది. శనివారం గుజరాత్ టైటాన్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ ప్రధాన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గాయంతో తీవ్రంగా ఇబ్బంది పడినప్పటికీ, అతనితో బలవంతంగా మ్యాచ్‌ను కొనసాగించడం ఇప్పుడు క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఫ్రాంచైజీల గెలుపోటముల కంటే దేశీయ ఆటగాళ్ల ఫిట్‌నెస్, భద్రత ముఖ్యమని భావించే భారత క్రికెట్ నియంత్రణ మండలి, ఈ వ్యవహారాన్ని చాలా తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్న సమయంలో వరుణ్



చక్రవర్తి పాదానికి గాయమైంది. సాధారణంగా ఆటగాడికి గాయమైతే వెంటనే మైదానం వెలుపలికి పంపి ఫిజియో పర్యవేక్షణలో ఉంచాలి. కానీ కేకేఆర్ కెప్టెన్ మరియు మేనేజ్‌మెంట్ మాత్రం వరుణ్ చక్రవర్తితో అతని నాలుగు ఓవర్ల పూర్తి కోటాను వేయించింది. బంతిని విసిరిన ప్రతిసారీ, రనప్ సమయంలోనూ వరుణ్ తీవ్రమైన నొప్పితో నడవలేక ఇబ్బంది పడటం లైవ్ టెలికాస్ట్ వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. సోషల్ మీడియాలో ఈ వీడియో క్లిప్స్ వైరల్‌గా మారడంతో, కేకేఆర్ జట్టు మేనేజ్‌మెంట్ కేవలం మ్యాచ్ గెలవడం కోసమే ఆటగాడి కెరీర్‌ను రిస్క్‌లో పడేసిందంటూ నెటిజన్లు, మాజీ క్రికెటర్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంపై బీసీసీఐ ఉన్నతాధికారులు మరియు నేషనల్ క్రికెట్ అకాడమీ వైద్య బృందం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఢిల్లీ వర్గాల ద్వారా తెలిసింది. వరుణ్ చక్రవర్తి బీసీసీఐ కేంద్ర కాంట్రాక్టు (   లో ఉన్న ఆటగాడు. బోర్డు నిబంధనల ప్రకారం.. కేంద్ర కాంట్రాక్టులో ఉన్న ఆటగాళ్లకు ఐపీఎల్ సమయంలో ఎలాంటి ఫిట్‌నెస్ సమస్యలు లేదా గాయాలు తలెత్తినా ఫ్రాంచైజీలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. గాయం తీవ్రతను దాచిపెట్టి లేదా నొప్పిని భరిస్తూ ఆటగాళ్లను మైదానంలోకి దించడం నిబంధనలకు విరుద్ధం. రాబోయే అంతర్జాతీయ సిరీస్‌లను దృష్టిలో ఉంచుకుని, ఆటగాళ్ల 'వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్'ను పర్యవేక్షించే బాధ్యత ఎన్‌సీఏ పరిధిలో ఉంటుంది. ఈ నేపథ్యంలో కేకేఆర్ ఫ్రాంచైజీ వరుణ్ చక్రవర్తి శారీరక ఫిట్‌నెస్‌ను నిర్లక్ష్యం చేయడంపై బోర్డు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు అంతర్గత సమాచారం. బీసీసీఐ జోక్యం చేసుకోవడం మరియు బోర్డు నుండి గట్టి హెచ్చరికలు రావడంతో కోల్‌కతా నైట్‌రైడర్స్ మేనేజ్‌మెంట్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. వరుణ్ చక్రవర్తి పాదానికి తగిలిన గాయం మరింత తీవ్రం కాకుండా ఉండేందుకు, అతనికి రాబోయే కొన్ని మ్యాచ్‌ల పాటు పూర్తి విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో కేకేఆర్ ఆడబోయే తదుపరి కీలకమైన మ్యాచ్‌కు వరుణ్ చక్రవర్తి ప్లేయింగ్ ఎలెవన్ (తుది జట్టు) కు దూరం కావడం దాదాపు ఖాయమైంది. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారుతున్న తరుణంలో తమ ప్రధాన వికెట్ టేకింగ్ స్పిన్నర్ గాయం బారిన పడటం, అది వివాదాస్పదంగా మారడం కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ అనే చెప్పాలి.

## ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్ ఆశలు సజీవం

ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రాజస్థాన్ మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 8 వికెట్లకు 193 పరుగులు చేసింది. ఢిల్లీ 19.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరింది. 5 వికెట్ల నష్టానికి 197 పరుగులు చేసి 4 బాల్స్ మిగిలి ఉండగానే ఛేజ్ చేసి గెలిచింది. ఈ విజయంతో ఢిల్లీ ప్లేఆఫ్ ఆశలు కొనసాగుతున్నాయి. రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో వైభవ్ సూర్యవంశి 21 బాల్స్‌లో 5 ఫోర్లు, 3 సిక్సులు కొట్టి 46 పరుగులు చేశాడు. కెప్టెన్ రియాన్ పరాగ్ 26 బాల్స్‌లో 3 ఫోర్లు, 5 సిక్సులతో 51 రన్స్ చేశాడు. ధ్రువ్ జురెల్ 40 బాల్స్‌లో 53 రన్స్ సాధించాడు. అయితే ఢిల్లీ క్యాపిటల్స్ లోని మిచెల్ స్టార్క్ 4 ఓవర్లలో 40 పరుగులు ఇచ్చి, 4 వికెట్లు తీసి రాజస్థాన్ మ్యాచ్‌ను తిప్పికొట్టాడు. అతను 14.2వ ఓవర్‌లో పరాగ్, 14.3లో డోనవన్ ఫెరీరా, 14.5లో రవి సింగ్ వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్‌లాంటి ప్రదర్శన



చేశాడు. లుంగి ఎన్‌గిడి 2 వికెట్లు, మధవ్ తివారి 2 వికెట్లు సాధించారు. రాజస్థాన్ ఇన్నింగ్స్ చివరి ఓవర్లలో ధమాల్ అంది. ఢిల్లీ ఛేజ్‌లో అభిషేక్ పోరెల్ 31 బాల్స్‌లో 7 ఫోర్లు, 1 సిక్స్ కొట్టి 51 పరుగులు చేశాడు. కేఎల్ రాహుల్ 42 బాల్స్‌లో 1 ఫోరు, 3 సిక్సులు కొట్టి 56 పరుగులతో అద్భుత ఆరంభం ఇచ్చారు. కెప్టెన్ అక్సర్ పటేల్ 19 రన్స్‌తో నాటౌట్‌గా నిలిచాడు. ఇతరులు కీలక సహకారం అందించారు. జోఫ్రా ఆర్చర్ 2 వికెట్లు తీసినా ఢిల్లీ స్థిరంగా ఛేజ్ పూర్తి చేసింది. అశుతోష్ శర్మ చివరి ఓవర్లలో సిక్స్‌తో మ్యాచ్‌ని ముగించాడని ఈఎస్‌పీఎన్ క్రిక్ ఇన్ఫో తెలిపింది. అక్సర్ పటేల్ (ఢిల్లీ) టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. అరుణ్ జైట్లీ స్టేడియం పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది, కానీ స్టార్క్ లాంటి బౌలర్లు డెత్ ఓవర్లలో ప్రభావం చూపారు. వాతావరణం హాట్ ఒ డ్రైగా కనిపించింది. ఈ విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ 13 మ్యాచుల్లో 6 విన్నింగ్స్‌తో 12 పాయింట్లు సాధించి 7వ స్థానంలో ఉంది. రన్ రేట్ -0.871. రాజస్థాన్ రాయల్స్ 12 పాయింట్లతో 6వ స్థానంలో ఉంది. ఈ జట్టు 12 మ్యాచ్‌లు ఆడి 6 గెలిచింది. రాజస్థాన్ బ్యాటింగ్ ఆరంభంలో బాగుంది కానీ మిడిల్ ఓవర్లలో.. స్టార్క్ స్టార్మ్ ఒకే ఓవర్‌లో 3 వికెట్లు తియ్యడం వల్ల చిక్కుల్లో పడింది. ఢిల్లీ బ్యాటింగ్ డెప్త్, ఫినిషింగ్ సామర్థ్యం గెలుపును తెచ్చిపెట్టాయి. రెండు జట్ల మధ్య పోటీ తీవ్రంగా కనిపించింది. ఇది సీజన్‌లో కీలక మ్యాచ్‌లలో ఒకటి. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ కూడా ఆటను ప్రభావితం చేసిందని ఎన్డీటీవీ స్పోర్ట్స్ రిపోర్ట్ చేసింది.



## ప్రముఖ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు దర్శకత్వంలో వస్తున్న మూవీ "లలిత"

ప్రముఖ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం “లలిత”. ఈ సినిమాను కాస్మిక్ పవర్ క్రియేట్స్ LLP బ్యానర్‌పై పి. సుధీర్ రాజు, డి. వైష్ణవి నేహా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో నందిని హీరోయిన్‌గా, అభిలాష్ పీలా, అఖిల్ వివాన్ హీరోలుగా పరిచయమవుతున్నారు. "లలిత" చిత్రానికి సంగీతాన్ని మ్యూజికల్ ద్యుయో మణి, నాగరాజు అందిస్తున్నారు. నాగరాజు ప్రముఖ వేణువాదకుడు కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి “కళారత్న” మరియు “వేణుగాన విశారద” పురస్కారాలు అందుకోవడం విశేషం. "లలిత" చిత్రంలో రఘు బాబు, పృథ్వీ రాజ్, తాగుబోతు రమేష్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. తన విశ్వాసం, వ్యక్తిత్వం కోసం నిలబడే ఓ మహిళ కథగా రూపొందుతున్న ఈ సామాజిక నేపథ్య చిత్రానికి 'గర్ల్‌ఫ్రెండ్ అంటే బానిస కాదు...' అనే క్యాప్షన్ ఆసక్తి కలిగిస్తోంది. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని డీటెయిల్స్ మేకర్స్ వెల్లడించనున్నారు.

## అట్లీ-ప్రియ దంపతులకు కూతురు

తమిళ దర్శకుడు అట్లీ కుటుంబంలో ఇటీవల ఆనందం రెట్టింపైంది. స్టార్ దర్శకుడు అట్లీ, ఆయన భార్య ప్రియ దంపతులకు ఇటీవల పండంటి ఆడబిడ్డ జన్మించింది. ఇప్పుడు తమ చిన్నారి కుమార్తెకు పెట్టిన ప్రత్యేకమైన పేరు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. గత ఏప్రిల్‌లో జన్మించిన తమ కుమార్తెకు అట్లీ దంపతులు 'మియూ' అనే ప్రత్యేకమైన పేరును ఖరారు



చేశారు. పాప పుట్టిన దాదాపు నెల రోజుల తర్వాత, ఆదివారం సోషల్ మీడియా ద్వారా ఈ పేరును అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా చిన్నారి చేతిని ప్రేమగా పట్టుకున్న ఓ మధురమైన ఫోటోను అభిమానులతో పంచుకున్నారు. ఆ పోస్ట్‌లో వారు, మా హృదయాలకు ఒక కొత్త ఇల్లు దొరికింది. ఆమె పేరు మియూ. మా గుండెల్లో అత్యంత పెద్ద స్థానాన్ని సంపాదించుకున్న చిన్నారి దేవత అంటూ భావోద్వేగంగా రాసుకొచ్చారు. ఈ పేరును ప్రత్యేకంగా నిలబెట్టింది దాని అర్థమే. సాధారణంగా భారతీయ లేదా సంస్కృత మూలాల పేర్లు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అయితే అట్లీ దంపతులు జపనీస్ సంస్కృతి నుంచి ఈ పేరును ఎంపిక చేసుకున్నారు. జపనీస్ భాషలో 'మియూ' అంటే అందం, ప్రేమ, పవిత్రమైన సౌమ్యత కలిగిన వ్యక్తి అనే అర్థం వస్తుంది. ఈ విభిన్నమైన పేరు నెటిజన్లను ఆకట్టుకుంటోంది. సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియాలో అట్లీ దంపతులకు అభినందనలు తెలియజేస్తున్నారు. కాగా, అట్లీ-ప్రియ దంపతులకు ఇప్పటికే ఒక కుమారుడు కూడా ఉన్నాడు. వారి పెద్ద కుమారుడు 'మీర్' జనవరి 2023లో జన్మించాడు.జవాన్ చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ఆయన క్రేజ్ పాన్-ఇండియా స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'రాకా'పై అట్లీ దృష్టి సారించారు.



## 'ది రెడ్ బ్యాగ్' చిత్రంలో సావిత్రి అనే పవర్ ఫుల్ పాత్రను పోషించిన రాశీ

మెమరీ మేకర్స్ బ్యానర్ మీద డిఫరెంట్ కాన్సెప్ట్, కంటెంట్‌తో కొత్త నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి 'ది రెడ్ బ్యాగ్' అనే సినిమాని నిర్మిస్తున్నారు. బ్యాగ్ చుట్టూ తిరిగే ఈ మూవీకి రవి కుమార్ సీరపు కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు.ఈ చిత్రంలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బదల్, భార్గవి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. తాజాగా ఈ సినిమా నుంచి స్పెషల్ రోల్ పోషిస్తున్న రాశీ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. సావిత్రి పాత్రలో రాశీ 'ది రెడ్ బ్యాగ్' సినిమాలో ఓ పవర్ ఫుల్ రోల్‌ను పోషించారు. ఇక ఈ పాత్రకు సంబంధించిన గెటప్, లుక్స్ ఎంత సింపుల్‌గా ఉన్నాయో.. ఆమె లుక్ అంత ఇంటెన్స్‌గా ఉంది. ఈ చిత్రాన్ని మలుపు తిప్పే ఓ కీలక పాత్రలో రాశీ నటించారు. ప్రస్తుతం ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే టీజర్‌ను రెడీ చేస్తున్నట్టుగా టీం తెలిపింది. ఇక టీజర్‌తో మూవీపై మరింత బజ్ క్రియేట్ కానుంది. తొలి సినిమానే అయినా, నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ బడ్జెట్‌తో చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీకి శేఖర్ మోపురి సంగీతమందించగా.. ప్రియేష్ గురుసామి కెమెరామెన్‌గా, శివ శర్వాని ఎడిటర్‌గా పని చేశారు.

## " నేను రెడీ " సినిమాతో మొదటి సారిగా.. తెలుగు తెరపై బాలీవుడ్ అందాలతార " నర్గీస్ ఫక్రి "

తన అందాలతో బాలీవుడ్ లో సంచలన విజయాలను అందుకున్న సెక్సీ తార నర్గీస్ ఫక్రి " నేను రెడీ " సినిమాతో తొలి సారిగా తెలుగు సినిమాలకు ఎంట్రీ ఇస్తోంది... యువ హీరో హవీష్, అందాల భామ కావ్య థాపర్ జంటగా సక్సెస్ ఫుల్ చిత్రాల దర్శకుడు నక్కిన త్రినాధరావు తెరకెక్కించిన " నేను రెడీ " సినిమాలో నర్గీస్ ఫక్రి తెరంగేట్రం చేసింది... సినిమాలోని ప్రత్యేకమైన పాటలో తన అంద చందాలతో యువతను మైమరపించునుంది... ఇటీవలే ఆర్ ఆర్ తో సహా చిత్రీకరణ పూర్తి చేసుకున్న "నేను రెడీ " సినిమా జూన్ రెండవ వారంలో విడుదలకు సిద్ధమవుతోంది.. అన్ని హంగులతో... అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా సినిమా ఉంటుందని... హవీష్ కు ఈ సినిమా క్లీన్ కమర్షియల్ హిట్ అందించనుందని యూనిట్ భావిస్తోంది... వచ్చే వారంలో ఆడియో రిలీజ్ కు సన్నాహాలు జరుగుతున్నాయని... వెంటనే ప్రమోషన్ కార్యక్రమాలు కూడా ప్రారంభిస్తామని నిర్మాతలు తెలియచేశారు. హార్నిక్స్ ఇండియా LLP బ్యానర్ పై కోనేరు సత్యనారాయణ నిర్మాతగా సిద్ధమైన నేను రెడీ సినిమాకు మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు




# కొరటాల, బాలయ్య కాంబో

## ఆసక్తికర అప్‌డేట్లతో చిత్రసీమలో హాట్ టాపిక్

టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్న కాంబినేషన్లలో ఒకటిగా మారిన నటసింహం నందమూరి బాలకృష్ణ దర్శకుడు కొరటాల శివ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్లు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే సినిమా కోసం బాలయ్య సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రంలోని సెకండ్ హాఫ్‌లో వచ్చే కీలక ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ కోసం బాలకృష్ణ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారట. ముఖ్యంగా ఈ పాత్ర కోసం ఆయన హెయిర్ స్టైల్‌లో ప్రత్యేక మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది. సెలబ్రిటీ హెయిర్ స్టైలిస్ట్ ఆలిమ్ హాకిమ్ ప్రత్యేకంగా బాలయ్య కోసం కొత్త హెయిర్ డిజైన్ రూపొందిస్తున్నట్లు సమాచారం. కేవలం హెయిర్ స్టైల్ మాత్రమే కాదు, బాలకృష్ణ డ్రెస్సింగ్ స్టైల్‌లో కూడా మార్పులు చేయనున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అభిమానులు చూడని విధంగా అల్ట్రా స్టైలిష్ మాస్ లుక్‌లో నటసింహం కనిపించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రం షూటింగ్ విషయానికి వస్తే, ఆగస్టు నెలలో సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. మొదటి షెడ్యూల్‌ను భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో ప్రారంభించేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. యాక్షన్‌తో పాటు భావోద్వేగాలకు కూడా ఈ సినిమాలో సమాన ప్రాధాన్యం ఉ ఒడబోతుందని తెలుస్తోంది. ముఖ్యంగా ఈ చిత్రంలో ఫ్యామిలీ ఎమోషన్స్ కీలకంగా ఉండనున్నాయని, కొరటాల శివ తన స్టైల్‌కు తగ్గట్టుగానే బలమైన సందేశంతో కూడిన కథను సిద్ధం చేశారని టాక్ వినిపిస్తోంది. దేవర తర్వాత కొరటాల తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో కథ విషయంలో ఆయన చాలా సమయం తీసుకుని కసరత్తు చేసినట్లు తెలుస్తోంది. ఇక నిర్మాణ బాధ్యతలను నిర్మాతలు సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. బాలయ్య ఇప్పటికే వరుస విజయాలతో ఫుల్ ఫామ్‌లో ఉండగా, కొరటాల శివతో



మొదటిసారి జతకట్టడం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. మాస్ ఎలిమెంట్స్, ఎమోషన్స్, స్టైలిష్ ప్రెజెంటేషన్ కలిస్తే ఈ సినిమా మరో భారీ హిట్‌గా నిలుస్తుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

## కాఫీకప్పులో తుఫాన్

సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో ఆర్‌జే బాలాజీ తెరకెక్కించిన చిత్రం 'కరుప్పు' తెలుగులో వీరభద్రుడుగా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఆదరణ సొంతం చేసుకుంటోంది.



ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ మూవీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వైరల్ అవుతోంది. ఇందులో విజయ్ నటించారంటూ ఓ వీడియో తెగ చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన సూపర్ హిట్ మూవీ 'లియో' చిత్రానికి సంబంధించిన రిఫరెన్స్ ఉన్నట్లు నెటిజన్లు గుర్తిస్తున్నారు. 'కరుప్పు'లో వచ్చే ఒక సన్నివేశంలో ఎవరో కాఫీ పెడుతున్నట్లు చూపిస్తారు. అయితే ఆ కాఫీ పెడుతున్న వ్యక్తి మరెవరో కాదు.. 'లియో' సినిమాలోని పార్థిబన్ (విజయ్) క్యారెక్టరేనని ఊహించుకుంటున్నారు. పైగా ఈ సన్నివేశానికి ముందు కాఫీ షాప్‌లో సర్వర్.. 'నీకు స్పెషల్ లియో కాఫీ తెస్తాను' అనడం.. అక్కడ కాఫీ పెడుతోన్న వ్యక్తిని వెనక నుంచి మాత్రమే చూపించడంతో అందరూ విజయ్ అతిథి పాత్రలో నటించారా! అని మాట్లాడుకుంటున్నారు. ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. కాఫీ షాప్ సన్నివేశంలో కనిపించిన శాండీ, జననీ ఇద్దరూ విజయ్ 'లియో'లోనూ కాఫీషాప్ సీన్‌లో నటించారు. ఈ సన్నివేశంపై నెటిజన్లు ఆసక్తికర కామెంట్స్ పెడుతున్నారు. 'ఈ సీన్ వచ్చినప్పుడు థియేటర్ అరుపులతో దద్దరిల్లింది' అని ఒకరు అనగా.. కరుప్పు' సినిమాలో ఆ కాఫీ కప్పు, ఆ మేకింగ్ స్టైల్ చూస్తుంటే కచ్చితంగా అది 'లియో' సినిమాలోని పార్థిబన్ కేఫ్ రిఫరెన్సే. ఆర్జే బాలాజీ నిజంగానే గట్టి ప్లాన్ చేశారు అని మరో నెటిజన్ కామెంట్ పెట్టారు.



## హీరో సుడిగాలి సుధీర్ కొత్త సినిమా "సుధీర్ జోకర్" టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్

సుడిగాలి సుధీర్ హీరోగా "సుధీర్ జోకర్" అనే కొత్త చిత్రం రాబోతోంది. బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్ గా పరిచయం అవ్వబోతుంది .ఈ చిత్రంలో అభిరామి,మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని విజయ్ దొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. రేపు హీరో సుడిగాలి సుధీర్ బర్త్ డే సందర్భంగా మేకర్స్ ఈ రోజు "సుధీర్ జోకర్" టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఈ రోజు రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో ప్లేయింగ్ కార్డ్స్ తో ఉన్న సుడిగాలి సుధీర్ ఆకట్టుకుంటున్నారు. రేపు ఈ సినిమా బాంగర్ రిలీజ్ తో పాటు ఫ్యాన్స్ తో ఇంటరాక్షన్ కూడా జరగబోతోంది. కంప్లీట్ కమర్షియల్ ఎంటర్ టైనర్ గా "సుధీర్ జోకర్" సినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని డీటెయిల్స్ మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

# టాక్సిక్ విడుదలలో మరింత జాప్యం

యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'టాక్సిక్'. దీని విడుదల కోసం అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా విడుదల గురించి తాజాగా యశ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని రిలీజ్ విషయంలో హాలీవుడ్ తరహా ప్రణాళికలు ఫాలో అవుతున్నట్లు చెప్పారు. అది ఇక్కడి వాళ్లకు నచ్చకపోవచ్చని కానీ, తాను ఏం చేసినా అభిమానుల కోసమేనని అన్నారు. ఓ హాలీవుడ్ మ్యాగజైన్ కవర్ ఫొటోకు పోజిలిచ్చిన యశ్.. దానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో 'టాక్సిక్' వాయిదాల గురించి మాట్లాడారు. ఆ సినిమా అంతర్జాతీయ స్థాయిలో విడుదల కానుంది. మేం అన్ని ప్రాంతాలను దృష్టిలోపెట్టుకుని విడుదలను ప్లాన్ చేస్తున్నాం. అంతర్జాతీయ స్థాయి




గుర్తింపు కోసం మేము తీసుకునే వ్యూహాత్మక నిర్ణయాలు, సాధారణంగా మన దేశంలో సినిమా విడుదల పద్ధతులకు పూర్తి భిన్నంగా ఉంటాయి. ఇక్కడ సినిమాను ప్రకటించినప్పటినుంచే ప్రమోషన్స్, మార్కెటింగ్ మొదలుపెడతారు. కానీ, 'టాక్సిక్' విషయంలో మేము హాలీవుడ్ విధానాన్ని అనుసరిస్తున్నాం. మొదట సినిమాను మొత్తం పూర్తి చేసి, ఆ తర్వాతే డిస్ట్రిబ్యూషన్ గురించి మాట్లాడుకుంటాం. ప్రస్తుతం నేను సినిమా విడుదల ప్రణాళికల పనుల్లోనే ఉన్నాను. ఈ పద్ధతి కచ్చితంగా అభిమానులకు నచ్చకపోవచ్చని అన్నారు. మొదట ఈ సినిమాను మార్చి 19న విడుదల చేయాలని భావించారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల దృష్ట్యా జూన్ 4కు వాయిదా వేశారు. తర్వాత ఈ తేదీకి కూడా రావడం లేదంటూ యశ్ పోస్ట్ పెట్టారు. గ్లోబల్ మార్కెట్‌ను దృష్టిలోపెట్టుకుని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/A2380